

సంతరించుకున్న ప్రత్యేకత

- పాడేరులో వేకువజాము సంత
- శీతాకాలంలో ప్రతి రోజూ క్రయవిక్రయాలు
- ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న వైనం
- తాజా పువ్వులు, కూరగాయలు, ఆకుకూరలు, అటవీ ఉత్పత్తుల అమ్మకాలు
- గిరిజన రైతులు, వర్తకులతో సందడి

-8లో

మామిడి పంట బీమా ప్రీమియం గడువు పెంపు

- ఈ నెల 31లోగా చెల్లింపునకు అవకాశం
- జిల్లా ఉద్యానశాఖాధికారి జి.ప్రభాకరరావు

అనకాపల్లి అగ్రికల్చర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత మామిడి పంట బీమా పథకం ప్రీమియం చెల్లించే గడువు ఈ నెల 31 వరకు ప్రభుత్వం పెంచిందని జిల్లా ఉద్యాన వన శాఖాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లాలో 16 వేల ఎకరాల్లో మామిడి తోటలు వున్నాయి. ఇంత వరకు ఈ పథకంలో సుమారు 400 మంది రైతులు మాత్రమే చేరారు. గడువు పొడిగించినందున మిగిలిన రైతులు కూడా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రీమియం మొత్తం 20 శాతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి ఏడున్నర శాతం (మొత్తం 15 శాతం) భరిస్తాయని, మిగిలిన 5 శాతం రైతులు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈదురు గాలులు, ఇతర ప్రకృతి వైపరీత్యాల కారణంగా మామిడి పంటకు నష్టం వాటిల్లితే బీమా కంపెనీ నుంచి రైతులకు పరిహారం అందుతుందని వెల్లడించారు.

డెయిరీలో ఉద్రిక్తత

చైర్మన్ కార్యాలయం ముట్టడికి కార్మికుల యత్నం

- విధులు బహిష్కరణ
- దిగివచ్చిన యాజమాన్యం
- కార్మిక సంఘ నేతలతో చర్చలు
- పదవీ విరమణ వయసు పెంపు సహా పలు డిమాండ్లు నెరవేర్చేందుకు అంగీకారం
- ఆందోళన విరమిస్తున్నట్టు కార్మికుల ప్రకటన

...వివరాలు 8వ పేజీలో

ముసురు..

వరి రైతులను వణికిస్తున్న తీవ్ర అల్పపీడనం

- ఆకాశం మేఘావృతం.. పలు మండలాల్లో మోస్తరు వర్షం
- కోసిన వరి పంటను కుప్పలు పెట్టుకునే హడావిడిలో రైతులు
- సాయంత్రం తరువాత పెరిగిన వర్షం
- జిల్లాలో నేడు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



చోడవరంలో కురుస్తున్న వర్షం

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో నాలుగు రోజుల నుంచి కొనసాగుతున్న అల్పపీడనం బుధవారంనాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడడంతో జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా అంతటా ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడు జల్లులు పడుతున్నాయి. బుధవారం సాయంత్రం తరువాత పలు మండలాల్లో వర్షం పెరిగింది. శీతలగాలులు వీస్తున్నాయి. కాగా తీవ్రవాయుగుండం ప్రభావంతో బుధవారం రాత్రి అనకాపల్లి జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గురువారం భారీ నుంచి అతిభారీగా వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం వెల్లడించడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్త మైంది. మత్స్యకారులు రానున్న మూడు రోజులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.



పాయకరావుపేట మండలం గుంటపల్లిలో వరి పనలను కుప్ప వేస్తున్న రైతులు

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో బుధవారం సాయంత్రం నుంచి వర్షాలు మొదలయ్యాయి. మధ్యాహ్నం వరకు ఆకాశంమేఘావృతమై వుండగా, ఆ తరువాత నుంచి దఫదఫాలుగా జల్లులు పడుతున్నాయి. గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి రైతులు అప్రమత్తమయ్యారు. గత మూడు, నాలుగు రోజుల్లో వరి పంటను కోసిన రైతులు వాతావరణం మార్పులతో మంగళవారం కుప్పలు వేయడం ప్రారంభించారు. కూలీలు లభించని రైతులు, వరి పనలు పూర్తిగా ఆరని పొలాల్లో బుధవారం కుప్పలు వేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ వరి రైతులకు పలు సూచనలు ఇస్తున్నారు. మూడు రోజుల వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని, కోత కోసిన పనలను వెంటనే కుప్ప వేయాలని చెబుతున్నారు. ఒకవేళ వరి పనలు పచ్చిగానే వుండి కుప్పవేయకపోతే వర్షాని తడిసిపోతాయని, ధాన్యం మొలకలు రాకుండా వుండడానికి పనలపై ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీచేయాలని సూచిస్తు న్నారు. పొలాల్లో వర్షం నిల్వలేకుండా బయటకు పోయే విధంగా ఏర్పాట్లు ... మిగతా 8వ పేజీలో



ఎస్.రాయవరం మండలం గోకులపాడులో కుప్ప వేయని వరి పనలు

వరి రైతులు అప్రమత్తం

మూడు రోజులపాటు వరి కోతలు వాయిదా వేసుకోండి

కోత కోసిన పంట తడవకుండా చర్యలు చేపట్టాలి

జేసీ ఎం.జాహ్నవి -8లో

నర్సీపట్నం ఆస్పత్రి విస్తరణ

150 నుంచి 200 పడకలకు పెంపు



ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో తీర్మానం
- నిధుల సేకరణకు కృషి చేస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి
- రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేయడంపై నివేదిక ఇవ్వండి
- వార్డుల్లో రోజుకో రంగు బెడ్‌షీట్స్ వినియోగించాలి
- ఆస్పత్రి అధికారులకు అయ్యన్న ఆదేశం
- సీటీ స్కానింగ్ మిషన్ ఆవశ్యకతను వెల్లడించిన వైద్యులు

నర్సీపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిని 150 పడకల నుంచి 200 పడకలకు పెంచడానికి, ఆ స్థాయిలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని నర్సీపట్నం ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. బుధవారం నిర్వహించిన ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్యశాలను 200 పడకలకు పెంచాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన నిధుల సేకరణకు కృషి చేస్తానని అయ్యన్నపాత్రుడు తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో ఏరియా ఆస్పత్రికి వచ్చిన రోగుల్లో పలువురిని ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేశారని, ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో కారణాలతో సహా నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వార్డుల్లో రోగులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, పారిశుధ్య సమస్య తలెత్తకుండా జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు. ఇన్‌పేషెంట్ వార్డులు, క్యాజువాలిటీలో రోజుకో రంగు బెడ్ షీట్ చొప్పున ఏడు రంగుల బెడ్‌షీట్‌లు వాడాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు అయ్యే ఖర్చుకు సంబంధించి అంచనాలు తయారు చేయాలని స్పీకర్ సూచించారు. ఆస్పత్రికిసీటీ స్కాన్ అవసరాన్ని వైద్యులు ఈ సందర్భంగా స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మిషన్ ఖరీదు రూ.2.5 కోట్లు అని డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్ చెప్పారు. ఈ పరికరం ఏర్పాటు కోసం ఎన్‌ఆర్‌ఐల నుంచి విరాళాల సేకరణ, లేదా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఓపీ విభాగం భవనానికి సోలార్ విద్యుత్ సదుపాయం, అంబులెన్స్‌లకు మరమ్మతులు చేయించాలని కమిటీ సమావేశంలో తీర్మానం చేశారు. కొత్త అంబులెన్స్‌కు ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు ఇస్తానని అనకాపల్లి ఎంపీ హామీ ఇచ్చారని స్పీకర్ తెలిపారు. ప్రతి నెలా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డీవో వీవీ రమణ, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భరణికంలో అతిసార

13 మందికి అస్వస్థత

- పరవాడ, అనకాపల్లి, విశాఖ ఆస్పత్రుల్లో చికిత్స
- గ్రామంలో పర్యటించిన రెవెన్యూ, పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు
- డయేరియా ప్రబలడానికి గల కారణాలపై ఆరా
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు
- బాధితుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వెల్లడి



విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాకర్లపూడి సన్యాసిరాజు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావును పరామర్శిస్తున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్

పరవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని భరణికం గ్రామంలో అతిసార ప్రబలింది. గత మూడు రోజుల్లో 13 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న అధికారులు బుధవారం గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య పనులు చేయించి, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. డయేరియా బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం మెరుగుపడిందని, ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పినట్టు స్థానిక అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.



భరణికంలో మహిళతో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ ఆయీషా

భరణికం గ్రామానికి చెందిన కాకర్లపూడి సన్యాసిరాజు (61), బొండా గంగమ్మ (62), కర్రి మోక్షిత్ (7), బొండా కాంతం (60), బొండా లక్ష్మి (55), గండిబోయిన నిఖిల్ (14), గండిబోయిన అప్పారావు (47), వాసంశెట్టి అప్పారావు (72), శశాంక్ సాయి (పది నెలల బాలుడు), బి.గంగరాజు (85), బి.గంగాభవాని (9), బి.ధనశ్రీ (7), చిన అప్పలనర్సమ్మ (70)లు సోమ, మంగళ, బుధవారాల్లో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వీరిని పరవాడ పీహెచ్‌సీ, అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంతోపాటు విశాఖ నగరంలోని రెండు ఆస్పత్రుల్లో చేర్పించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు వెల్లడించారు. కాగా భరణికం గ్రామంలో అతిసార ప్రబలిన విషయం తెలుసుకున్న అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయీషా, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, అదనపు డీఎంహెచ్‌ఓ జ్యోతి, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ తదితరులు ... మిగతా 8వ పేజీలో

కలగానే కాజ్‌వే నిర్మాణం!

ఐదేళ్ల నుంచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పలు గ్రామాల ప్రజలు

- ఎర్రిగెడ్డపై టీడీపీ హయాంలో కల్వర్టు స్థానంలో కాజ్‌వే మంజూరు
- నిర్మాణ దశలో మారిన ప్రభుత్వం
- పనులు పూర్తయినా.. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించని వైసీపీ పాలకులు
- అదే ఏడాది వరదలకు కొట్టుకుపోయిన కాజ్‌వే
- బిల్లు ఇవ్వలేదన్న కోపంతో సిమెంట్ పైపులు ఎత్తుకెళ్లిన కాంట్రాక్టర్
- నాలుగేళ్ల నుంచి ప్రతిపాదనలు, టెండర్లకే పరిమితం
- కూటమి ప్రభుత్వం అయినా కాజ్‌వే నిర్మించాలని వినతి



ఎర్రిగెడ్డపై గతంలో కాజ్‌వే నిర్మించింది ఇక్కడే

చోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

మండలంలో రాయపురాజుపేట పంచాయతీ పరిధిలోని ఎర్రిగెడ్డపై కాజ్‌వే నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అయినా పూనుకోవాలని, తమకు రవాణా కష్టాలు తొలగించాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాజ్‌వే నిర్మాణ పనులను ప్రతిపాదనలతో కాగితాలకే పరిమితం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున కాజ్‌వే పునరుద్ధరణ పనులు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

చోడవరం మండలంలో రాయపురాజుపేట సమీపంలో ఎర్రిగెడ్డ కాలువపై గతంలో కాజ్‌వే ఉండేది. గోవాడ, అంభేరుపురం, గజపతినగరం తదితర పంచాయతీల ప్రజలు రాయపురాజుపేట, శేమునాపల్లి, కె.కోటపాడు తదితర ప్రాంతాలకు ఈ కాజ్‌వే మీద నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ పంచాయతీల పరిధిలోని రైతులు చోడవరం రావడానికి, పోవడానికి అనువుగా ఉంటుంది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లడానికి ఇది దగ్గరదారి. ఎర్రిగెడ్డ కాలువపై గతంలో చిన్నపాటి కల్వర్టు ఉండేది. టీడీపీ గతంలో అధికారంలో కల్వర్టు స్థానంలో సిమెంట్ పైపులతో కాజ్‌వే నిర్మాణం చేపట్టారు. పనులు సాగుతుండగా సాధారణ ఎన్నికలు జరిగి, వైసీపీ అధికారంలోకి వచ్చింది. కొద్ది వారాల్లో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి బిల్లు పెట్టారు. అయితే టీడీపీ హయాంలో నిర్మాణం ప్రారంభించారన్న సాకుతో కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించలేదు. అదే ఏడాది అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు ఎర్రిగెడ్డ పొంగడంతో కాజ్‌వే కొట్టుకొపోయింది. తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక సర్పంచ్ రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ తదితర నేతలు, స్థానికులు కలిసి చందాలు వేసుకుని కాజ్‌వేకు మరమ్మతులు చేయించి వాహనాల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దారు. మరుసటి ఏడాది.. 2020లో వచ్చిన వరదలకు ఎర్రిగెడ్డ పొంగడంతో ... మిగతా 8వ పేజీలో



ఇత్తడి సప్పరంపై ఉభయదేవేరులతో ఉపమాక వెంకన్న తిరువీధి సేవ

ఇత్తడి సప్పరంపై శ్రీవారి తిరువీధి సేవ

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నక్కపల్లి మండలం ఉపమాక క్షేత్రంలో బుధవారం స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఇత్తడి సప్పరంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, పల్లకీపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు.

-నక్కపల్లి/ ఆంధ్రజ్యోతి

పంచాయతీ ఆదాయం పక్కదారి

ప్రైవేటు వ్యక్తి చేతిలో ఆర్వో వాటర్ ప్లాంట్

- రెట్టింపు ధరకు నీటిని అమ్ముతున్నా పట్టించుకోని అధికారులు

అచ్యుతాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

గ్రామ పంచాయతీకి చెందిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను నిర్వహణ పేరుతో ప్రైవేటు వ్యక్తికి అప్పగించేశారు. ఇతను నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు మంచినీటిని అమ్ముకుంటున్నాడు. అంతేకా లీటరు, అర లీటరు బాటిళ్లలో నీటిని నింపి, మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్నాడు. వాటర్ ప్లాంట్ ద్వారా వస్తున్న ఆదాయం అంతా ఇతని జేబులోకి వెళుతుండగా, వాటర్ ప్లాంట్ విద్యుత్ బిల్లును మాత్రం పంచాయతీ నిధుల నుంచి చెల్లిస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.



మండల కాంప్లెక్స్ వద్ద ఆర్వో వాటర్ ప్లాంట్



విక్రయానికి సిద్ధం చేసిన లీటరు, అర లీటరు వాటర్ బాటిల్స్

అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఏషియన్ పెయింట్స్ కర్మాగారం యాజమాన్యం సామాజిక బాధ్యత కింద సీఎస్‌ఆర్ నిధులతో గతంలో అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ వద్ద ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ... మిగతా 8వ పేజీలో

'అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి'



సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా అధికారి రమణ

ఎలమంచిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ అగ్నిమాపక కేంద్రాన్ని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎన్.వి.రమణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన మరిన్ని జాగ్రత్తలపై ఆయన సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాలప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. అంతేకాకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తొలుత ఆయనకు ఎలమంచిలి అగ్నిమాపక శాఖాధికారి రాంబాబు, సిబ్బంది స్వాగతం పలికారు.

కట్టుబోలులో ఘనంగా నవదుర్గామాత జాతర



దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

రాంబిల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొట్టుబోలు గ్రామంలో బుధవారం నవదుర్గామాత జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం పడిపూజను అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం భవానీ భక్తులు శూలాలను ధరించి గ్రామ పురవీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.

గవర్ల అనకాపల్లిలో తోడపెద్దు మృతి



తోడపెద్దు అంతిమ యాత్రలోగ్రామస్థులు భజనలు

మునగపాక, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తోటాడ పంచాయతీ శివారు గవర్ల అనకాపల్లిలో తోడపెద్దు బుధవారం మృతిచెందింది. సిం హాద్రి అప్పన్నగా భావించే తోడపెద్దు కాలం చేయడంతో గ్రామస్థులంతా విషాదంలో మునిగిపోయారు. మధ్యాహ్నం దానిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు. ప్రత్యేక పూజలు, భజనల అనంతరం మిగిలిన కార్యక్రమాలను పూర్తి చేశారు.

అర్హులందరికీ 'ఉపాధి' కల్పించాలి

▸▸ గత ప్రభుత్వంలో పథకం అమలులో అక్రమాలు ▸▸ ఇకపై ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉండరాదు

▸▸ వలసల నివారణే లక్ష్యం కావాలి ▸▸ ప్రజా వేదికలో ఎమ్మెల్యే సుందరపు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ





ఉపాధి పథకంలో పనులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే సుందరపు, సదస్సులో మాట్లాడుతున్న ప్రగడ

రాంబిల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. పథకానికి సంబంధించి సామాజిక తనిఖీల అనంతరం బుధవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రజా వేదికను నిర్వహించారు. ముందుగా డీఆర్‌పీ డి.రాజేంద్రరావు మండలంలోని 30 పంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 720 పనులు, అందుకు అయ్యే ఖర్చుల వివరాలు తదితరాలను చదివి వినిపించారు. అనంతరం సుందరపు, ప్రగడ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉపాధి పథకంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ పథకాన్ని అధికారులు తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా అర్హులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తద్వారా వలసలు అరికట్టేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పనుల్లో ఎటువంటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి, జిల్లా విజిలెన్స్ అధికారిణి నిర్మలాదేవి, ఎంపీడీవో జయమాధవి, డీపీఎం ఫైనాన్స్ అధికారి పి.వెంకటరమణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దినబాబు, పప్పల నూకన్నదొర, వైసీపీ మండల నాయకుడు జి.శ్రీనుబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను చూపుతున్న విద్యార్థులు

ఎలమంచిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జంపపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన శిలపరశెట్టి నాగేశ్వరరావు స్టడీమెటీరియల్‌ను సమకూర్చారు. వీటిని ప్రధానోపాధ్యాయుడు శాస్త్రితో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ తాజా, మాజీ చైర్మన్లు కనకారావు, సూరి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

రాంబిల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి మీదుగా వాడనర్సాపురం వద్ద గల నేవీ గేటు వరకు నిర్మాణంలో ఉన్న తారురోడ్డు పనులను బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎటువంటి లోపాలు ఉన్నా సహించేది లేదని హెచ్చరించారు. కాగా అప్పన్నపాలెం కాలనీ వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు చెక్



పెదపాడులో రైతు నుంచి అర్జీని స్వీకరిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జడ్పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. పెదపాడులో బుధవారం జరిగిన సదస్సులో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన వివిధ సర్వేల కారణంగా రైతుల భూముల రికార్డులు తారుమారయ్యాయని ఆరోపించారు. ఈ కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తోందన్నారు. అనంతరం అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్, రీసర్వే డీటీ శైలజ, మండల సర్వేయర్ రాధ, వీఆర్‌వో వెంకట్, సర్పంచ్ జనపరెడ్డి అరుణ, ఎంపీపీ కోన సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : పెదకలవలాపల్లిలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావి దేముళ్ళు మాట్లాడుతూ తమ గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండచుట్టూ నేవీ ప్రహరీ గోడ నిర్మిస్తుండడం వల్ల అన్నివిధాలా నష్టపోతున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మునగపాక : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు అన్నారు. మండలంలోని పి.ఆనందపురంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అర్జీలను సమర్పించారు. వీటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతామని వివరించారు. రెవెన్యూ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పెద్దింటి అమ్మవారికి విశేష పూజలు



అమ్మవారికి ప్రగడ పూజలు

అచ్యుతాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొండకర్లలో పెద్దింటి అమ్మవారు ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కంఠంరెడ్డి శ్యామల రాజు, దాసరి నర్సింగరావు, కారుకుండి రమేష్, సిరసపల్లి నాగేష్, కోనూరి భాను, పప్పల రమణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అచ్యుతాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకోవాలని వెదురువాడ సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు అన్నారు. వెదురువాడలో బుధవారం విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్, ఏషియన్ పెయింట్స్ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మాతా, శిశు ఆరోగ్యం పట్ల ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినగర్‌లో చోరీపై కేసు

ఎలమంచిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామ్మూర్తినగర్‌లో రిటైర్డు ఎక్సైజ్ అధికారి బొడ్డేడ వెంకటరమణ ఇంట్లో జరిగిన చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ సావిత్రి తెలిపారు. బాధితుడు రమణ ఈ నెల పదో తేదీన భార్యతో కలిసి కర్ణాటకలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లారన్నారు. ఈ నెల 16వ తేదీన ఆయన ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్న వ్యక్తి రమణ ఇంట్లో చోరీ జరిగినట్టు గుర్తించి ఫోన్ ద్వారా సమాచారం అందించారన్నారు. ఇంటి యజమాని రమణ వచ్చి ఇంటిని పరిశీలించి సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు మర్నాడు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఆమె చెప్పారు.

అన్నదాతను వణికిస్తున్న అల్పపీడనం

పంట కాపాడుకోవడానికి కుప్పలు పెట్టే పనిలో నిమగ్నం



అడ్డరోడ్డు సమీపంలో వరి పనలను కట్టలు కడుతున్న రైతులు

పాయకరావుపేట రూరల్/ఎస్.రాయవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులను వణికిస్తోంది. ఇప్పటికే చిరుజల్లుతో కూడిన వర్షం కురుస్తుండడంతో చేతి వచ్చిన వరి పంట ఎక్కడ దెబ్బతింటుందోనని రైతులు దిగులు చెందుతున్నారు. దీంతో పంటను కాపాడుకోవడం కోసం పొలాలకు పరుగులు తీస్తున్నారు. ఎస్.రాయవరంలో బుధవారం కూలీల సహాయంతో వరి పనలను కట్టలు కట్టించి కుప్పలు వేసుకున్నారు. అంతేకాకుండా పలు గ్రామాల్లో చాలా వరకు కోసిన వరి పనలు కుప్పలు పెట్టకుండా ఉండిపోవడంతో, ఎక్కడ వర్షాలు కురిసి తడిచిపోయి పంట దెబ్బతింటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పాయకవరావుపేట మండలంలోని సత్యవరం, మంగవరం, గుంటపల్లి, గోపాలపట్నం, పెంటకోట, పెదరాంభద్రపురం గ్రామాల్లో వరి పనలను కుప్పలు వేస్తున్నారు. కొంతమంది రైతులు వరి పనలు ఆరకపోవడంతో పొలాల్లోనే వదిలేశారు. కాగా, ఈ నెల 21వ తేదీ వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఎస్.రాయవరం ఏవో సౌజన్య సూచించారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్

నక్కపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థలో ఈ నెల 28న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. హోం మంత్రి నివాసం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో వున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సుమారు 50 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

కోటవురట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్రాభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామని ఎంపీడీవో కాశీవిశ్వనాథం పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు పేదలకు మరింత చేరువయ్యే విధంగా పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాలను దినదిన అభివృద్ధి చేయాలని ఆయన చెప్పారు. ఈ శిక్షణ శిబిరంలో ఈవోపీఆర్‌డీ రఘురామ్, ఎంపీహెచ్‌వో గోవిందరావు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ





నక్కపల్లి, పాయకరావుపేటలో బాధితులకు చెక్కులు అందిస్తున్న మంత్రులు అనిత, అనగాని, నాయకులు

నక్కపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందరాజుపేట గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి రూ.4.57 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌ను నక్కపల్లిలో హోం మంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన నందిక చిన్న అప్పారావు బ్రెయిన్ ట్యూమర్, సహా ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఇందుకుగాను రూ.12 లక్షలు వైద్యం కోసం ఖర్చుకావడంతో బాధిత కుటుంబం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎం రూ.4.57 లక్షలు మంజూరు కావడంతో బుధవారం చిన్న అప్పారావు భార్య వరలక్ష్మికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దార్ల కృష్ణ వున్నారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట: కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న వెంకటనగరం గ్రామానికి చెందిన మేరుగు మణికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.55 లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు బొంది కాశీవిశ్వనాథం తదితరుల చేతుల మీదుగా బాధితురాలు మేరుగు మణికి అందించారు. అనంతరం పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి మెరుగైన వైద్య సాయం కోసం మంత్రి అనిత సిఫార్సులతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన తిరిక సాయం అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిక్కాల శ్రీను, పల్లా విలియంకేరీ, వంకా శివ, హరి, దువ్వి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా గెడ్డం బుజ్జి జన్మదిన వేడుకలు





బుజ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న తోట నగేశ్, తదితరులు... రక్తదానం చేసిన అభిమానులకు షీల్డు అందిస్తున్న బుజ్జి

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, జీసీఆర్ ఫౌండేషన్ అధినేత గెడ్డం బుజ్జి జన్మదిన వేడుకలను బుధవారం గుంటపల్లిలోని ఆయన స్వగృహంలో కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య జన్మదిన కేకును ఆయన కట్ చేశారు. జనసేన నాయకుడు తోట నగేశ్ బుజ్జికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చి గెడ్డం బుజ్జిని గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మరి కొంత మంది అభిమానులు, కార్యకర్తలు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి రక్తందానం చేశారు. రక్తదానం చేసిన అభిమానులకు ఆయన షీల్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెడ్డం కన్నబాబు, గెడ్డం చైతన్య, గెడ్డం ఆకాశ్, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం, కోటవురట్ల మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు యగదాసు నానాజీ, వెలగా సుధాకర్, శింగంపల్లి శ్రీనివాసరావు, పప్పల శివ, నాయకులు జగన్నదొర, ఆచంట దొర, పల్లి దుర్గ, కట్టా పెంటబాబు, సుంకర సూరిబాబు, రెడ్డి పవన్‌కుమార్, అల్లు నరశింహమూర్తి, రేఖపల్లి లక్ష్మణరావు, మామిడి శ్రీను, సీతారాంపురం సర్పంచ్ పక్కుర్తి వెంకటకృష్ణ, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చినఉప్పలం సదస్సులో 56 వినతులు

ఎస్.రాయవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినఉప్పలం గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 56 వినతులు స్వీకరించినట్టు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సుల ద్వారా గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'ఉమ్మడి రిజర్వేషన్‌తో నష్టపోయాం'

కోటవురట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రిజర్వేషన్ వల్ల నష్టపోయామని విశాఖ కలెక్టర్ కార్యాలయంలో వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌మిశ్రాకు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వంగలపూడి రాంబాబు, గంటేడ లోవరాజు, చందా శ్రీనివాసరావు, పెదపూడి అప్పారావు, జి.అప్పలరాజు, చెంగలకుమార్, ఎం.దేముడు పాల్గొన్నారు.

అర్జీలను 40 రోజులోగా పరిష్కరిస్తాం: తహసీల్దార్



జగ్గంపేట సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

కోటవురట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి 40 రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. మండలంలోని టి.జగ్గంపేట గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో రైతుల నుంచి 16 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన ప్రతీ దరఖాస్తు ఆన్‌లైన్ చేసి త్వరతగతిన పరిష్కరిస్తామని చెప్పారు. భూములు రీ సర్వే సమయంలో హెచ్చుతగ్గులు ఉన్నా, ఒన్‌బీ ఆన్‌లైన్ రాకపోయినా, సాంకేతిక లోపాలు తలెత్తినా రైతులు ఈ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా, సదస్సులో అటవీ భూములు సాగు చేసుకున్న రైతులు పట్టాల మంజూరుకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు.

భూ సమస్యపై మంత్రికి ఫిర్యాదు

నక్కపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపమాక గ్రామస్థులు దశాబ్ద కాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యను పరిష్కరించాలని దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. బుధవారం హోం మంత్రి అనిత నివాసానికి వచ్చిన రెవెన్యూ మంత్రిని కలిసి వినతి పత్రం అందించారు. ఉపమాకలోని సర్వే నంబరు 112లో గ్రామ కంఠమంతా 22ఏ ఆలయ రికార్డుల్లో నమోదైపోయిందన్నారు. దీనివల్ల ఎవరైనా ఇళ్ల స్థలాలు, భూములు అమ్ముకోవాలన్నా రిజిస్ట్రేషన్ కావడంలేదని మంత్రికి చెప్పారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి కేబినెట్ సమావేశంలో ప్రస్తావించి, తదుపరి టీటీడీ ఈవోతో కూడా మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ ఉపమాక క్లస్టర్ ఇన్‌చార్జి కొప్పిశెట్టి బుజ్జి, తోలేటి శ్రీను, వాసు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

కోటవురట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి సరోజని సూచించారు. జల్లూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె వరి పొలాలను పరిశీస్తూ రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరి పంట కోత కోస్తే పొలంలోనే పనలను కుప్ప వేసుకోవాలన్నారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మధు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

పాల్తేరులో పొలం పిలుస్తోంది..

పాయకరావుపేట రూరల్: రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఏవో ఆదినారాయణ కోరారు. పాల్తేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. కోత కోసిన పంటను వెంటనే కుప్పలు వేసుకోవాలన్నారు. పంటల ఇన్సూరెన్సును రైతులు ఉపయోగించుకోవాలన్నారు. మామిడి తోటలకు రూ.2200, వరి పంటకు రూ.600, అపరాలకు రూ.300 ఇన్సూరెన్సు ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలి'

పాయకరావుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఏక సభ్య కమిషన్ ప్రతినిధి రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంపల చినరాజు, నాయకులు మంజులూరి దుర్గాప్రసాద్, కుందూరు కుమార్, గంపల సుబ్బారావు, బొడ్డపాటి వీరాస్వామి, కె.చంటిబాబు, జి.ఆనంద్, కె.కృష్ణ, పి.స్వామయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ రద్దు చేయాలని వినతి

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ అంశంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేయాలని మాల మహానాడు ప్రధాన కార్యదర్శి పెదపాటి మేఘరంజన్ తదితరలు ఏకసభ్య కమిషన్ ప్రతినిధికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మహానాడు నాయకులు ఇంజరపు సూరిబాబు, సీహెచ్.పేర్రాజు, తాటిపర్తి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌లు ఏర్పాటు చేసేందుకు తీసిన గొయ్యి

త్వరలో డీసీఎంఎస్‌లో పెట్రోల్ బంక్



డీసీఎంఎస్ కార్యాలయం వద్దకు చేరిన ట్యాంకులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనకాపల్లిలో పెట్రోల్, డీజిల్ అమ్మకాల రంగంలోకి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) అడుగు పెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఏటా ఈ సంస్థ ద్వారా విద్యా సంవత్సరం సమయంలో పుస్తకాలు అమ్మకాలు, దీపావళి సమయంలో బాణసంచా విక్రయాలు నిర్వహిస్తుంది. గత రెండేళ్లుగా సంస్థ పరిధిలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయాలని భావించారు. అయితే ఎట్టకేలకు బంకు ఏర్పాటుకు హెచ్‌పీసీఎల్ సంస్థతో ఒప్పందం కుదిరింది. డీసీఎంఎస్ కార్యాలయానికి ఈనెల 11వ తేదీన హెచ్‌పీసీఎల్ అధికారులు వచ్చి బంకు ఏర్పాటుకు అవసరమైన పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అదే రోజున డీసీఎంఎస్ స్పెషల్ ఆఫీసర్ అయిన విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ సమక్షంలోనే హెచ్‌పీసీఎల్ అధికారులు పెట్రోల్‌బంకు ఏర్పాటుకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నారు. 20 ఏళ్ల పాటు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ద్వారా వ్యాపారం జరగనుంది. ఇందులో భాగంగా డీసీఎంఎస్ కార్యాలయ ముఖద్వారానికి ఎడమ వైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో గల ఇరవై సెంట్లు స్థలాన్ని బంకు ఏర్పాటుకు కేటాయించారు. దీంట్లో బంకుకు అవసరమైన పనులు ప్రారంభమయ్యాయి. ఈ వ్యాపారంతోనైనా సంస్థ ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలుంటాయని కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. పెట్రోల్ బంకు ఏర్పాటుకు అవసరమైన 20 సెంట్ల స్థలాన్ని డీసీఎంఎస్ కేటాయించినందున స్థలం లీజు నిమిత్తం నెలకు రూ. 50వేలను హెచ్‌పీసీఎల్ సంస్థ డీసీఎంఎస్‌కు చెల్లించనుంది. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ వ్యాపారంలో కుదుర్చుకున్న నిబంధనల ప్రకారం లీటరుకు కొంత మొత్తం కమీషన్‌గా కూడా ఇవ్వనుంది. దీనివల్ల డీసీఎంఎస్‌కు ఆదాయం సమకూరనుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీసీఎంఎస్ కార్యాలయాల పరిధిలో ఇప్పటికే పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే విజయనగరం డీసీఎంఎస్ పరిధిలో అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడం వల్ల అక్కడ మాత్రమే పెట్రోల్‌బంకు వ్యాపారం చేయడం లేదని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. అనకాపల్లిలో పెట్రోల్‌బంకు ఏర్పాటుకు ఎన్‌ఓసీ వచ్చి ఆరు నెలలకు పైగా అయింది. ఎట్టకేలకు కార్యాలయ ఆవరణలో పెట్రోల్ బంకు ద్వారా వ్యాపారం చేసేందుకు డీసీఎంఎస్ మార్గం సుగమం అయింది. ఇందులో భాగంగా పనులు ముమ్మరమయ్యాయి. ఇదిలావుంటే, సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్‌బంకు మూడు నెలల్లో నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తుందని డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వీవీ సత్యకుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గత కొంతకాలం నుంచి పెట్రోల్‌బంకు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించాలని భావించామన్నారు. ఎట్టకేలకు ఎన్‌ఓసీ రావడంతో హెచ్‌పీసీఎల్ అధికారులతో సంస్థ స్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఒప్పందాలు కుదిరినట్టు చెప్పారు.

బేడ, బుడగ జంగాలకు న్యాయం చేయాలని వినతి



చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న తాతారావు తదితరులు

సబ్బవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బేడ, బుడగ జంగాలకు సంపూర్ణ న్యాయం చేయాలని కోరుతూ బుధవారం విశాఖ విచ్చేసిన ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య సమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు బేడ, బుడగ జంగాల ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు కటుమూరి తాతారావు తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన 144 జీవోను రద్దు చేసి, నిజమైన బేడ, బుడగ జంగాలకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడం వల్ల సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కటుమూరి బాబూరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు దుడ్డు కొండయ్య, పస్తం అప్పారావు, మోతీ గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'తప్పెటగుళ్లు కళకు జీవం పోస్తున్న రమణ'



తప్పెటగుళ్లు కళాకారుడు రమణను సత్కరిస్తున్న ప్రతినిధులు

కశింకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కశింకోటకు చెందిన తప్పెటగుళ్లు కళాకారుల ఆర్గనైజర్ పల్లా రమణకు పడమటమ్మ పుట్టుక మహోత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. తప్పెటగుళ్లు కళ కనుమరుగవుతున్న రోజుల్లో ఈ కళను ఎంతో ప్రోత్సహించి జీవం పోస్తున్నారని ప్రశసంఇచారు. పడమటమ్మ నెల పండుగ సందర్భంగా కస్పావీధిలో కమిటీ సభ్యులు సాలువా కప్పి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు దాసరి బాబు, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, సురా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో పరిఢవిల్లుతున్న పచ్చదనం



పరవాడలోని బీసీ బాలుర వసతి గృహం

పరవాడ బీసీ బాలుర వసతి గృహంలో ఎటుచూసినా మొక్కలే

» అరటి, కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి

» వార్డెన్ సంకల్పం.. విద్యార్థుల పట్టుదల వెరసి ఆహ్లాదకర వాతావరణం

ప్రభుత్వ వసతి గృహం.. ఈ పేరు వినగానే అక్కడ సమస్యలు కొలువుదీరి ఉంటాయని చాలా మందిలో ఓ అభిప్రాయం. అయితే ఇందుకు భిన్నంగా పరవాడ ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం దర్శనమిస్తోంది. వార్డెన్ల ప్రోత్సాహం, విద్యార్థుల ప్రత్యేక దృష్టి వెరసి పచ్చదనంతో కళకళలాడుతోంది.

పరవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటైంది. ఇక్కడ ప్రస్తుతం మూడు నుంచి పదో తరగతి వరకు 120 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 17ఏళ్ల క్రితం ఇక్కడ వార్డెన్‌గా పనిచేసిన రామకృష్ణ వసతి గృహాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పదుల సంఖ్యలో మొక్కలు నాటి విద్యార్థులతో కలిసి వసతి గృహాన్ని పచ్చని తోరణంలా తీర్చిదిద్దారు. అయితే పదేళ్ల క్రితం వచ్చిన హుద్‌హుద్ తుఫాన్ ధాటికి మొత్తం పచ్చదనం కనుమరుగై వసతి గృహం కళాహీనంగా మారింది. పచ్చదనాన్ని మళ్లీ పునరుద్ధరించుకోవాలనే సంకల్పంతో తుఫాన్ అనంతరం పదిహేను రోజులకే అప్పటి వార్డెన్ నారాయణరావు ప్రోత్సాహంతో మళ్లీ విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. ఐదేళ్ల క్రితం ఇక్కడ వార్డెన్‌గా విధులు చేపట్టిన జయరాజ్‌కు మొక్కలంటే మక్కువ. ఆయన పదుల సంఖ్యలో మొక్కలను తెచ్చి నాటించారు. దీంతో వసతి గృహం పూర్వ వైభవాన్ని సంతరించుకుని కళకళలాడుతోంది. అతను పదవీ విరమణ ఆనంతరం ఏడాది క్రితం మ్యాట్రిన్‌గా విధులు చేపట్టిన రజిని పచ్చదనంపై మరింత దృష్టి సారించారు.

క్రోటన్స్, కూరగాయల మొక్కలు పెంపకం

వసతి గృహంలో అడుగు పెట్టే వారికి పచ్చదనం స్వాగతం పలుకుంది. ఇక్కడ పదుల సంఖ్యలో క్రోటన్ మొక్కలు, పూలు, కూరగాయల మొక్కలు పచ్చగా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మామిడి, నేరేడు, కొబ్బరి చెట్లు పెంచుతున్నారు. గార్డెన్ లోపల గోంగూర, మిరప, వంగ, అరటి తదితర మొక్కలు వేసి వాటి నుంచి వచ్చే కాయగూరలను వంటకాల్లో వినియోగిస్తున్నారు. హైబ్రీడ్ అరటి చెట్లను పెంచి వాటి ఫలాలను విద్యార్థులు అందుకుంటున్నారు.



వసతి గృహం ఆవరణలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలు

సంరక్షణ ఇలా...

ఇక్కడి విద్యార్థులు ఒక్కపక్క చదువుతో పాటు మరో పక్క మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. బృందంగా ఏర్పడి నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరుపోస్తున్నారు. వారానికోసారి మొక్కలకు గొప్పు తవ్వడంతో పాటు కలుపుతీసి సేంద్రియ, రసాయన ఎరువులను వేస్తున్నారు. దీంతో మొక్కలు బాగా ఎదిగి పచ్చగా కళకళలాడుతున్నాయి.



మరింత దృష్టి సారిస్తాం



విద్యార్థులు చదువుతో పాటు మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. నిత్యం బాధ్యతగా మొక్కలకు నీరు పోస్తూ వారానికోసారి కలుపు తీసి ఎరువులు వేస్తున్నారు. పచ్చదనం కారణంగా విద్యార్థులు ఆహ్లాద వాతావరణంలో చదువుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. వర్షపు, వాడుకనీరు వృథా కాకుండా ఇంకుడు గుంతలోకి పంపుతున్నాం. ఇక్కడ పండిన కూరగాయలను విద్యార్థులకు వండే వంటలకు వినియోగిస్తున్నాం. భవిష్యత్తులో వసతి గృహాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దడమే లక్ష్యం.

- రజిని, మ్యాట్రిన్,
బీసీ బాలుర వసతి గృహం

జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యం కావాలి

» పోలీస్ అధికారుల సమీక్షలో ఎస్పీ తుహిన్ సిన్హా



నెలవారీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ముందుగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులకు సంబంధించి వివరాలను పవర్‌పాయింట్ ద్వారా ప్రెజెంటేషన్ చేసి ఆయా కేసుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలపై ఆరా తీశారు. వాటి పరిష్కారానికి పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రధానంగా పోక్సో చట్టం కింద నమోదైన కేసులు, ఆస్తి కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులపై దృష్టి సారించి దర్యాప్తు ముమ్మరం చేయాలన్నారు. మహిళలు, చిన్నారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, చోరీలు, మత్తు పదార్థాల రవాణా తదితరాలను అరికట్టేందుకు దృష్టి పెట్టాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి వారికి కౌన్సెలింగ్ ఇస్తూ నేర ప్రవృత్తికి దూరంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం విధుల్లో ప్రతిభకనబరిచిన 30 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, డీఎస్పీలు శ్రావణి, సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతులు వరి పంట కోతలు నిలిపివేయాలి

» తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి » జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



వెదురిపర్తిలో రైతులకు సూచనలు ఇస్తున్న మోహనరావు

కశింకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ హెచ్చరికల జారీ నేపథ్యంలో రైతులంతా వరి పంట కోతలను నిలిపివేయాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిన పనలను వీలైనంత వరకు కుప్పలుగా పెట్టుకొని టార్పలిన్లు కప్పుకోవాలన్నారు. ఒకవేళ ఎక్కడైనా వరి పనలు తడిసినట్లైతే మొలకెత్తకుండా ఉండడానికి తరువాత ఉప్పు నీటిని పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎం.స్వప్న, గ్రామ వ్యవసాయాధికారిణి లక్ష్మి సింధుజ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : తుఫాన్ కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి సూచించారు. మార్టూరులో బుధవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంట తరలింపు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మార్టూరులో వరి పంట తరలింపుమ పరిశీలిస్తున్న ఏవో

గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు

» అధికారులు, ప్రజాప్రతినిధుల శిక్షణ ముగింపులో ఎంపీడీవో



గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

సబ్బవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వారం రోజులుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను గుర్తించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ఆయా గ్రామాలు ప్రగతి బాటన పయనిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, వెలుగు ఏపీఎం సీహెచ్.శ్రీనివాస్, కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగంపై ఫిర్యాదుల స్వీకరణ

» జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరిస్తామని కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జీవీఎంసీ లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి అధికంగా ఫిర్యాదులు./వినతులు వస్తున్నాయన్నారు. దీంతో ఈ విభాగానికి సంబంధించి ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి పట్టణ ప్రణాళిక అధికారులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెక్షన్ పరిధిలో గల 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 20న తుమ్మపాల, అల్లిఖానుడుపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో 24 గంటల పాటు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

20న సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పర్యటన

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 20న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పీపీ వావా పర్యటించనున్నారని కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి అనకాపల్లి చేరుకుంటారని, మర్నాడు ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ అధికారులతో, అనంతరం జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు, సఫాయి కర్మచారుల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని ఆమె వివరించారు. అనంతరం విశాఖపట్నం జిల్లా పర్యటనకు వెళతారన్నారు.

21న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

కశింకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈ నెల 21న కశింకోట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అనకాపల్లి మండలం కొత్తూరు సెక్షన్ కార్యాలయంలో నిర్వహించనున్నామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. వినియోగదారులు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్నా ఆయన దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు.

'భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలి'

అనకాపల్లి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారాలు చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఇక్కడ కోరారు. భూ సమస్యలు పరిష్కారానికి కోనేరు రంగారావు కమిటీ చేసిన సిఫార్సులు ప్రకారం ప్రతి జిల్లాకు ప్రత్యేక ఐఏఎస్ అధికారులను నియామకం చేసి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో భూ సమస్యలపై ప్రజలకు విశ్వాసం ఇవ్వలేదన్నారు. ఉత్తరాంధ్రలో ఉన్న భూ సమస్యలు పరిష్కరించకుండా గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కుంభకోణాలపై ఎవరికి తోచినట్లు వారు సమీక్ష చేశారే తప్ప వాస్తవంగా ఉన్న భూముల సమస్యలపై సదస్సు జరగలేదన్నారు. ఒక్క అనకాపల్లిలోనే 25వేల భూ సమస్యలకు వినతులు వచ్చాయంటే భూ సమస్య తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ సదస్సులో భూవివాదాలు పరిష్కారమార్గాలు చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పల్లెల్లో భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



పరవాడ మండలం నాయుడుపాలెంలో మేలుకొలుపు

పరవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పల్లెల్లో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగింపు జరుపుతున్నారు. ఈ సందర్భంగా భజనలు, భక్తిగీతాలను ఆలపిస్తున్నారు. మండలంలోని నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. ఫౌండేషన్ సభ్యులు కూండ్రపు అప్పలనాయుడు, కూండ్రపు ముత్యాలనాయుడు, కడిమిశెట్టి కృష్ణవేణి, శ్రీనివాసరావు, లక్ష్మి, అచ్యుత, కన్నూరు శ్రీను, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలో..

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : ధనుర్మాసం సందర్భంగా సబ్బవరం షిర్డీసాయి భజన మండలి సభ్యులు గోపాల్‌నగర్, జోడుగుళ్ల, సాయినగర్ ప్రాంతాల్లో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం స్థానిక రామాలయంలో భజనలు చేశారు. భజన మండలి సభ్యులు దంగేటి నానిబాబు, కొరాడ శ్రీను, కనకరాజు, ఉసికిరల రమేశ్, వాసు, పెద్దాడ రమణమ్మ, ధనిమిరెడ్డి పాప తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు చెక్

సబ్బవరం, పరవాడ తహసీల్దార్లు చిన్నికృష్ణ, అంబేడ్కర్



అంతకాపల్లిలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నభూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని అంతకాపల్లిలో బుధవారం ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తున్నట్టు చెప్పారు. నిర్దేశిత సమయంలో వాటిని పరిష్కరిస్తామన్నారు. సర్వే విభాగం ఏడీ ఎస్.గోపాలరాజు, డీటీ గణపతిరావు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, సర్వేయర్లు లోకేశ్, రాంబాబు, వీఆర్వో రుక్మిణి, గ్రామ పెద్దలు మిడతాడ మహాలక్ష్మీనాయడు, పల్ల రమణ, ఎస్.నర్సింహమూర్తి, సబ్బవరపు రమణ, రొగలి దేముడు, ఎస్.దేముడు తదితరులు పాల్గొన్నారు.



పెదముషిడివాడలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

పరవాడ : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను అంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అంబేడ్కర్ కోరారు. పెదముషిడివాడలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను రెవెన్యూ సదస్సు ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. అనంతరం వివిధ సమస్యలపై 98 అర్జీలను అందుకున్నట్టు వివరించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేష్, వీఆర్వో వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విశాఖ-భద్రాచలం రెండో నైట్ సర్వీసు రద్దుతో ఇక్కట్లు

- మావోయిస్టుల వారోత్సవాలు ముగిసినా బస్సును పునరుద్ధరించని ఆర్టీసీ అధికారులు
- ప్రయాణికులు అసహనం

సీలేరు, డిసెంబరు 18 : విశాఖపట్నం- భద్రాచలం వయా సీలేరు మీదుగా నడిచే రెండు నైట్ సర్వీసుల్లో ఒక దానిని ఆర్టీసీ అధికారులు రద్దు చేయడంతో ఈ ప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విశాఖపట్నం డిపోకు చెందిన విశాఖ- భద్రాచలం వయా నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలానికి సాయంత్రం ఆరుగంటలకు ఒకటి, రాత్రి ఏడున్నరకు రెండవ సర్వీసు గత కొన్ని సంవత్సరాలుగా నడుపుతున్నారు. ఈ రెండు సర్వీసులు ప్రయాణికులతో కిటకిటలాడుతుంటాయి. అయితే, డిసెంబరు 2 నుంచి 8 వరకు ఏవోబీ లో మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా నైట్ సర్వీసులను రద్దు చేయాలని సూచించారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ఘాట్‌లో తిరిగే విశాఖ భద్రాచలంతో బాటు సీలేరు నైట్ హాల్టును కూడా నిలిపి వేశారు. డిసెంబరు 8 తేదీతో మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు ముగియడంతో ఈ బస్సులను పునరుద్ధరించాలని పోలీసులు సూచించారు. అయితే, విశాఖ డిపో అధికారులు మాత్రం రెండు సర్వీసుల్లో ఒకదాన్ని రద్దు చేసి, విశాఖలో రాత్రి 7.30కు బయలుదేరే బస్సును మాత్రమే నడుపుతున్నారు. ఫలితంగా సీలేరు, డొంకరాయి,



రద్దీగా ఉన్న భద్రాచలం వెళ్లే బస్సు

మోతుగూడెం,చింతూరు, భద్రాచలం ప్రాంత ప్రయాణికులు సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ రూట్‌లో తిరిగే బస్సులు చాలా తక్కువ . దీనికి తోడు ఉన్న సర్వీసులను రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బందులకు లోను చేయడం ఎంతవరకు సమంజసమని ఈ ప్రాంత ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారు లు స్పందించి విశాఖ- భద్రాచలం రెండవ నైట్ సర్వీసును కూడా పునరుద్ధరించి తమ కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

'షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలి'



గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు భార్గవితో గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాలను ఆదివాసీలకు కేటాయించాలని గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు సదా భార్గవిని టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. బుధవారం లంబసింగి వచ్చిన ఆమెను ఈశ్వరి కలిశారు. ఈసందర్భంగా ఆమె గిరిజన గ్రా మాలకు తాగు నీరు, రహదారి సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. గిరిజన ప్రాంతంలో ప ర్యాటక అభివృద్ధి చేయడంతోపాటూ స్థానిక యు వతకు ఉపాధి కల్పించాలన్నారు. జీసీసీ డైరెక్టర్ బొర్రనాగరాజు, టీడీపీనాయకులు లక్ష్మణ్, రాము, బీమన్న, మహేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ దృష్టికి మన్యం సమస్యలు



లోకేశ్‌కు సమస్యలు వివరిస్తున్న టీడీపీ అరకు పార్లమెంటరీ కోశాధికారి నాగేశ్వరరావు

డుంబ్రిగుడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మన్యంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను టీడీపీ అరకు పార్లమెంట్ నియోజవర్గ కోశాధికారి నాగేశ్వరరావుబిటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. అమరావతిలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సామాజిక పింఛన్లు కోల్పోయిన గిరిజనులకు ఆదుకోవాలని విన్నవించారు. పదెకరాల భూమి ఉందన్న కారణంగా కొంతమంది గిరిజనుల పింఛన్లు తొలగించారని వివరించారు. ఈ భూములు అంతగా సాగుకు యోగ్యం కావని తెలిపారు. ఇలా రద్దు చేసిన వారి పింఛన్లు పునరుద్ధరించి ఆదుకోవాలని కోరారు. పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విన్నవించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెవె న్యూ సదస్సుల ద్వారా సమగ్ర నివేదికను తీసుకువచ్చి పింఛన్ దారులకు న్యా యం చేయాలన్నారు. మంత్రిలోకేశ్ సానుకూలంగా స్పందించి గిరిజనుల ను ఆదుకుంటామని భరోసా ఇచ్చినట్టు నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు.

'గురుకుల ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి'



గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు

పాడేరురూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐటీడీఏ కార్యాలయం వద్ద చేపట్టిన రోజులుగా దీక్షలు 33వ రోజుకు చేరాయి. బుధవారం రాజారావు శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల ఉద్యోగులు 33 రోజులుగా రిలే దీక్షలు చేపడుతున్నా, కూటమి ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమన్నారు. వంటకుక్, వాచ్‌మెన్‌లకు ఇచ్చే వేతనం కంటే అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తక్కువ ఇవ్వడం చూస్తే వారి జీవించే హక్కును హరించడమే అవుతుందని విమర్శించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తెల్లరేషన్ కార్డులు, తల్లిదండ్రుల పింఛన్లు, జాబు కార్డులు తొలగించిన అధికారులు వేతనాలు పెంచడం ఎలా మరచిపోయారని ప్రశ్నించారు. సమస్యను కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ప్రభుత్వం స్పందించి వీరి సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్, రామకృష్ణ, కొండబాబు, వెంకటేశ్వర్లు, నాగరాజు, హేమలతపాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



ఎంపీడీవోకు వినతి పత్రమిస్తున్న బొండాపుట్టు గ్రామస్తులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగురాయి పంచాయతీ దిగువ బొండాపుట్టులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్థులు కోరారు. బుధవారం వారు ఎంపీడీవో శ్రీసాయిహర్షకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన బలరాం, అర్జును, సన్యాసిరావు, ప్రహ్లాదు, రఘుపతి తదితరులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు సుమారు 60 కుటుంబాలు ఉన్నాయన్నారు. గ్రామంలో ఉన్న బోరునుంచి ఆశించిన స్థాయిలో నీరు రావడంలేదని తెలిపారు. దీంతో గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. గత్యంతరం లేక గ్రామ సమీపంలో గల కలుషిత ఊటగెడ్డ నీటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కలుషిత నీరు తాగడంతో తరచూ పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యపై ఎంపీడీవో సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. గ్రామస్తుల వెంట టీడీపీ నాయకుడు ఎం.చిన్నిబాబు, వార్డు మెంబర్ బలరాం తదితరులు ఉన్నారు.

పశువుల కుమ్ములాటలో బాలునికి గాయాలు



పెదబయలులో రోడ్డుపై పశువుల స్వైరవిహారం

పెదబయలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పశువులు స్వైర విహారం చేస్తున్నాయి. రెండు పశువులు కుమ్ములాటలో ఓ బాలుడికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. బుధవారం సాయంత్రం స్థానిక ప్రధాన కూడలిలోని టీ టైమ్స్ వెనుకనున్న వీధిలో రెండు పశువుల కుమ్ములాడుతూఅక్కడున్న పిల్లల మీదకు దూసుకువెళ్లాయి. సమీపంలో ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల గడుతూరి యువధర్మతేజకు కాళ్లు, నడుం భాగాలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై ఆ చిన్నారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని రోడ్డుపై పశువుల సంచారాన్ని నియంత్రించాలని కోరుతున్నారు.

ఉన్నత విద్యతోనే యువతకు భవిష్యత్తు



ఫ్రెషర్స్ డే సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరురూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డిగ్రీతో స్వస్తి పలకుండా ఉన్నత విద్యలపై దృష్టి సారించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీక ళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి కోరారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు జూనియర్, సీనియర్ అనే తారతమ్యం లేకుండా స్నేహ భావంతో మెలగాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.శివయ్య, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, అధ్యాపకులు వి.కోటేశ్వరరావు, సాంబమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలల వికాసంపై ప్రజల్లో అవగాహన

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

పాడేరురూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలల వికాసంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ పీవో పి. ఝాన్సీరాణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కిశోర బాలల వికాసంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తేనే ఆరోగ్యంగా ఉంటారన్నారన్నారు. విద్యతో వారికి భవిష్యత్తు కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను గ్రామాల్లో ప్రజలకు వివరించి వాటి నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల పిల్లలను బడి బయట ఉండకుండా పాఠశాలలకు వెళ్లేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. గ్రామాల్లో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలపైనా చైతన్యవంతం చేయాలని కోరారు. ఈ శిక్షణలో లింగ వివక్షత, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లైంగిక వేధింపులనుంచి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టడం, నైపుణ్యం, ఉపాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు, ఎంఈవో ఎస్. విశ్వప్రసాద్, డీసీపీవో డాక్టర్. సద్దు, ఎల్‌సీపీవో అశోక్, డీఆర్‌డీఏ ఏపీఎం, డీపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వివిధ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సీసీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సెమీ కిస్మస్ వేడుకలు విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సహకారంతో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎంపీ మాధవి, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ ప్రముఖ ప్రసంగికులు ఏసుపాదంతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాస్టర్లు కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సర్వజనీనమని అన్నారు. దేవునిపైభక్తి, విశ్వాసం, విధేయతలతో ప్రతీ ఒక్కరూ జీవించాలని సూచించారు. లోక రక్షకుడు, కరుణామయుడైన ఏసు గొప్ప సందేశాలను మానవాళికి అందించారన్నారు. అతిథులను, పాస్టర్లను జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మూ ర్తి దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, జీసీసీ మాజీ చైర్మన్ శోభ స్వాతీరాణి, హుకుంపేట మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, పాస్టర్లు, వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏవో

పెదబయలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనంతో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో వరి, రాజ్‌మా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ సూచించారు. వరి కోతలు, నూర్పు కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే కోసిన వరి పనలను కుప్పలుగా వేసి, టార్పాలిన్లతో భద్రపరచాలన్నారు. కోత దశకు వచ్చిన రాజ్‌మా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

అధ్యాపకులకు మద్దతుగా తల్లిదండ్రుల ఆందోళన



అధ్యాపకులకు మద్దతుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పాడేరురూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులకు అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల కళాశాల ప్రాంగణంలో బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కార్తీక్, కె.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారావు, జీవన్‌కృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మణ్ మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమస్యలపై నెలరోజులుపైగా ఐటీడీఏ ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టడంతో ఆయా పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ, అధ్యాపకుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి వారిని దీక్షలు విరమించేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆడాకులు గ్రామ సభ వాయిదా

కొయ్యూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆడాకుల గ్రామంలో గిరిజనేతరుల సాగులో ఉన్న భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరుకు వీలుగా గురువారం ఆడాకులలో నిర్వహించ తలపెట్టిన గ్రామసభ వాయిదా వేసినట్టు తహసీల్దారు ఎస్ఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఆదేశాల మేరకు 19వ గ్రామ సభ నిర్ణయించామని, అనివార్య కారణాలతో ఈ సభ వాయిదా వేశామని, తిరిగి మరో తేదీ ప్రకటిస్తామన్నారు.



రేవళ్లు సదస్సులో వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దారు



బడిమెలలో మాట్లాడుతున్న తహసీల్దార్ త్రినాధరావు నాయుడు

భూ సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొయ్యూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గిరిజన ప్రాంతంలో రెవెన్యూ సంబంధిత సమస్యలు పూర్తి పరిష్కారమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జీసీసీ మాజీ చైర్మన్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రేవళ్ళు పంచాయతీలో ఎంపీపీ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా భూ సంబంధ సమస్యలపై 70 వినతులు స్వీకరించారు. వీటిలో ఎఫ్ లైన్‌కు సంబంధించి 10, మ్యుటేషన్‌లు 51, డీ పట్టాలకు గానూ ఐదు, వెబ్ ల్యాండ్ యాడింగ్‌కు నాలుగు వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీటీ కుమార్ స్వామి, రీ సర్వే డీటీ అప్పన్న, ఆర్ఐ రాజా నదిరా, సర్వేయర్, వీఆర్‌వో, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడిమెల సదస్సులో 121 ఫిర్యాదులు

పాడేరురూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు మండలంలో విశేష స్పందన లభిస్తుందని తహసీల్దార్ వంజంగి త్రినాదరావు నాయుడు అన్నారు. బుధవారం బడిమెల పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన సదస్సుకు ప్రజల నుంచి 121 ఫిర్యాదులు అందాయన్నారు. భూ సమస్యలు పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతగానో దోహద పడుతున్నాయన్నారు. సదస్సులకు భూ వివాదాలు, భూ ఆక్రమణలు, మ్యుటేషన్‌లపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: భూ సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. బుధవారం దామనాపల్లి పంచాయతీ కేంద్రంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా 30 అర్జీలను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలన్నీ పరిశీలించి సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పట్టా యజమానికి మరణిస్తే కుటుంబ సభ్యులు, వారసులు మ్యుటేషన్ చేయించుకోవాలన్నారు. వ్యవసాయ భూములను కుటుంబ సభ్యులు, వారసులకు బహుమతి రూపంలో అందజేయవచ్చునన్నారు. డీటీ దుమంతి సత్యనారాయణ ఆర్ఐ మహదేవ్, సర్పంచ్ కుందరి రామకృష్ణ, సర్వేర్ శ్రీను పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎంపీపీ

చింతపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు కట్టడికి సచివాలయం ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి కోరారు. బుధవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో జరుగుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎంపీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో



సచివాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ అనుషదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు

ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా సచివాలయం ఉద్యోగులు పనిచేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పంచాయతీ పరిధిలో అమలు చేయాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ప్రజలకు తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్ పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు మీనాకుమారి, ఎంపీహెచ్ఈవో స్వామి పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వినియోగదారుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

పెదబయలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని వక్తలు అన్నారు. మండల పరిధి సీతగుంట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల-1లో బుధవారం 38వ జాతీయ వినియోగదారుల సంఘం వారోత్సవాలను జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బూడిదే చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ వరహాలమ్మ, ఎంపీడీవో పూర్ణయ్య ఎంఈవో -2 పుష్పజోసెఫ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో జరగనున్న వ్యాసరచన పోటీల్లో 8వ తరగతి, 9వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని కోరారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ సభ్యుడు లోహిదాసు మాట్లాడుతూ కల్తీ లేని సరకులు వి క్రయాలే ధ్యేయంగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బొంజుబాబు, భాస్కరరావు,హెచ్‌ఎం నాగేశ్వరరావు, వీఆర్‌వో అజాద్, దేవరాజు, బాలకృష్ణ, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాతో భవిష్యత్తు అవసరాలకు మేలు



విద్యుత్ పొదుపుపై ర్యాలీ నిర్వహిస్తున్న ఈపీడీసీఎల్ ఉద్యోగులు, విద్యార్థులు

చింతపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆదాపై వినియోగదారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. సన్నిరాంబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, విద్యార్థులు విద్యుత్ పొదుపు, విద్యుదాఘాతానికి గురికాకుండగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ వినియోగదారులు అనవసరంగా విద్యుత్ దీపాలను వెలించరాదన్నారు. అలాగే తడి కాళ్లు, చేతులతో స్విచ్‌లు, గృహోపకరణాలు వాడరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈలు ప్రభాకరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు



విజేతలతో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు. తదితరులు

పాడేరురూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాలలో బుధవారం టీటీడీ, విశ్వ హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. భగవద్గీత ఆత్మ సంయమయోగలోని 6వ అధ్యాయంలో 47 శ్లోకాలను విద్యార్థులు పఠించారు. జూనియర్ విభాగంలో విజ్ఞాన భారతి విద్యార్థులు చెట్టి తన్విశ్రీ (6వ తరగతి) ప్రథమ స్థానంలో నిలవగా ద్వితీయ, తృతీయ స్థానాలను వరలక్ష్మి, పంపా సీతా మహాలక్ష్మి కైవసం చేసుకున్నారు. సీనియర్ విభాగంలో సీహెచ్.హసిత్ సాయి ప్రథమ స్థానం, మోదమాంబ ఉన్నత పాఠశాలకు చెందిన కె.నిహారిక ద్వితీయ, టి.గ్రీష్మ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ సీహెచ్.సత్యనారాయణ, పాఠశాల కరెస్పాండెంట్ టి.బాబూరావు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. బి.వెంకటరత్నం, ఎం.క్రాంతి కుమార్, ఎం.నాగేంద్ర, బి.నరసింహమూర్తి ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్డుపై ఆక్రమణలు తొలగించాలి: తహసీల్దార్

ముంచంగిపుట్టు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న రేకు షెడ్లను వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించాలని తహసీల్దార్ నర్సమ్మ ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం ప్రజా ప్రతినిధులు, వ్యాపారులతో ఆమె సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న రహదారి విస్తరణ పనులు, రహదారికి అనుకుని ఉన్న రేకు షెడ్ల తొలగింపుపై చర్చించారు. రహదారి విస్తరణ పనులకు అందరూ తమవంతు సహకారం అందించాలని ఆమె కోరారు.

ఆలయ రహదారి పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో త్వరలో నిర్మాణం చేపట్టనున్న లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి సంబంధించి రహదారి నిర్మాణ పనులకు బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర శంకుస్థాపన చేశారు. ఏనుగురాయి పంచాయతీ సుల్లాం గ్రామ సమీపంలో ఉపాధి నిధులు రూ. 10లక్షలతో సుమారు రెండు కిలో మీటర్ల రహదారి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మీనృసింహస్వామి ఆలయం నిర్మించడం ఎంతో శుభప్రదంఅన్నారు. అలాగే రహదారి పనులైన వెంటనే ఆలయ నిర్మాణం పనులు ప్రారంభమవుతాయన్నారు. సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

పాడేరురూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో మండలంలో ఈ నెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. ఆధార్ అప్‌డేట్, న్యూ ఎన్‌రోల్‌మెంట్, డాక్యుమెంట్ అప్‌డేట్స్, బయోమెట్రిక్ అప్‌డేట్స్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు చింతలవీధి, గొండెలి, తుంపాడ, మినుములూరు, పాడేరు -2, సలుగుల్లో నిర్వహిస్తామన్నారు. 26 నుంచి 28వ తేదీ వరకు గుత్తులపుట్టు, డోకులూరు, వంతాడపల్లి, లగిశపల్లి, పాడేరు- 1, దేవాపురంలల్లో ఆధార్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామన్నారు. వీటిని వినియోగించాలని కోరారు.

అన్నదాతల్లో గుబులు

తీవ్ర అల్పపీడనంతో పొలం బాట పట్టిన రైతులు

ముసురుతో భయంభయం.. వరి కుప్పలు వేసుకునే పనిలో నిమగ్నం



మాకవరపాలెంలో వరి పనలను కుప్పలు పెడుతున్న రైతులు

చోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనంతో అన్నదాతలో గుబులు రేగుతోంది. జిల్లాలో భారీ వర్షాలు కురిస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వారికి కనుకు లేకపోతోంది. ఇప్పటికే కోసిన వరి పంటను రక్షించుకునే పొలాల బాట పట్టారు. వరి పనలను కుప్పలు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

చోడవరంలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి మబ్బులు కమ్ముకున్నాయి. అయితే మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి అడపాదడపా చిరుజల్లులతో కూడిన మోస్తరు వర్షం కురవడం ప్రారంభమైంది. గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి పంట వేసుకున్న రైతులు భయాందోళన చెందుతున్నారు. వారంతా పొలం బాట పట్టి వరి పనలను కుప్పలు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలో వర్షం పడడంతో అన్నదాత గుండెల్లో గుబులు పుడుతోంది. ఇప్పటికే వరస తుఫాన్‌లతో సతమవుతున్న రైతులు, మరో రెండు రోజులు భారీ వర్షాలు మళ్లీ కురుస్తాయని వాతవరణ కేంద్రం చేసిన హెచ్చరికలతో కంటి మీద కునుకులేకుండా చేస్తుంది. మండలంలో ఇప్పటికే 90 శాతం వరికోతలు కోశారు. ఇప్పుడు వాటిని కుప్పలు వేస్తున్నారు. రెండు రోజులు క్రితం కోసిన వరి చేనును తుఫాన్ కారణంగా కుప్పలు వేయాల్సి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. బుధవారం మల్లవరం, గిడుతూరు, మాకవరపాలెం గ్రామాల్లో వ్యవసాయ అధికారి చిరంజీవి వరి పంటను పరిశీలించారు. వరి పనలు బాగా తడిస్తే ఉప్పు ద్రావణాన్ని చల్లాలని రైతులకు ఆయన సూచించారు.

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలోని ఒక పక్క కూలీల కొరత.. మరోపక్క అల్పపీడనం హెచ్చరికతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం హడావిడిగా వరి కుప్పలు వేసేందుకు పొలాలకు పరుగులు తీశారు. పాతమల్లంపేట, పాకలపాడు, జోగంపేట, గొలుగొండ, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, కొత్తమల్లంపేట, అమ్మపేట గ్రామాల్లో వరిచేను కోత కోసి పొలాల్లోనే ఉంది. ఇప్పుడు వరి పనలను కుప్పలుగా వేయడానికి కూలీలు దొరక్కపోయినా పక్క గ్రామాల నుంచి తీసుకువచ్చిమరీ కుప్పలు ఏర్పాటు చేసుకుంటున్నారు. బుధవారం సాయంత్రం జోగంపేట, గొలుగొండ, చీడిగుమ్మల, పాతమల్లంపేట గ్రామాల్లో జల్లులు పడ్డాయి.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలో తుఫాన్ కారణంగా ముసురు వాతావరణం నెలకొంది. బుధవారం తెల్లవారు నుంచి చిరు జల్లులు పడ్డాయి. అనంతరం రోజంతా చీకటి వాతావరణ నెలకొంది. సాయంత్రం ఐదు గంటల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. తుఫాన్ కారణంగా రైతులు కోతకోసిన వరి పంట ఏమవుతుందోనని దిగులు చెందుతున్నారు. ప్రతీ ఏడాది పంట చేతికందివచ్చిందనే సరికి తుఫాన్ రూపంలో నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జల్లుల వరకు పర్వాలేదని, అంతకుమించి అధికంగా కురిస్తే ఇంటికి పట్టుకొని వెళ్లాల్సిన పంట నీటిపాలు కాకతప్పదని వారు దిగాలు చెందుతున్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: సీహెచ్.నాగాపురం, పల్లావూరు, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, విప్పలపాలెం తదితర గ్రామాల్లో కోసిన వరిపనలపై చిరుజల్లు పడ్డాయి. తుఫాన్ హెచ్చరికలతో కోసిన వరిపనలు కుప్పలు పెట్టుకునే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో చిలుజల్లు పడుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే పంట దక్కవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వరి పండినప్పటికీ వర్షాలతో నష్టపోతున్నామని వారు వాపోయారు.



గొలుగొండ మండలం పాతమల్లంపేటలో వరి కుప్పలు వేసుకుంటున్న రైతులు



పాతకృష్ణాదేవిపేటలోని పొలాంలోనే ఉన్న వరి పనలు

చీడికాడలో...



చీడికాడలోని పొలాల్లో వరి పనలను కుప్పలుగా పెట్టిన రైతులు

చీడికాడ: బంగాళఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో మండలంలో చిరుజల్లులు పడుతున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి మబ్బులు కమ్మడంతో అదే రోజు పొలాల్లో రైతులు వరి పంటను చిన్నచిన్న కుప్పలు పెట్టారు. అర్ధరాత్రి సమయంలో కాస్త జల్లులు పడ్డాయి. బుధవారం ఉదయం వాతావరణం బాగుండడంతో మళ్లీ పొలం బాటపట్టారు. మరలా మధ్యాహ్నం చిరుజల్లులు పడడంతో చేసేదిలేక రైతులు పొలాల్లోనే వరి పనలను కుప్పలు పెడుతున్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మడలంలో బుధవారం ఉదయం నుంచి చినుకులు పడ్డాయి. మధ్యాహ్నానికి వర్షం కురియడంతో పొలాల్లో ఉన్న వరి పనలు తడిచిపోయాయి. చాలా వరకు రైతులు పొలాల్లోని వరి పంటను కుప్పలు వేయగా, మరికొంత మంది కోసిన పనలపై టార్పాలిన్లు కప్పుతున్నారు. కాశీపురం, నాగయ్యపేట, రైవాడ, సీతంపేట దేవరాపల్లి గ్రామాల్లో వరిపనలు తడిచిపోయాయి.

నర్సరీల్లో ప్రిన్సిపల్ కన్జర్వేటర్ తనిఖీలు



సామాజిక నర్సరీలో అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కన్జర్వేటర్

చోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక అటవీ శాఖ నిర్వహిస్తున్న నర్సరీలను ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఎస్.శ్రీధర్ బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని గౌరీపట్నం ప్రాంతంలోని సామాజిక నర్సరీలను తనిఖీ చేయడంతో పాటు బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట ప్రాంతంలో వేసిన ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట విశాఖ అటవీ సర్కిల్ అధికారి మహ్మద్ నివాస్ మైదిన్, డీఎఫ్‌వోలు శామ్యూల్, జి.లక్ష్మణ్, రేంజి అధికారులు రవివర్మ, జగదీశ్, సెక్షన్ అధికారి రమణ, వనసేవిక్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

గొలుగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులతో అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజీ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.13.8 లక్షలతో రోడ్డు మరమ్మతులు



తారు రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ జేఈ

మాకవరపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నుంచి మాకవరపాలెం వరకు రూ.13.8 లక్షలతో తారు రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నామని ఆర్‌అండ్‌బీ జేఈ నారాయణరెడ్డి చెప్పారు. కొండల అగ్రహారంలో ఈ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకన్నపాలెం నుంచి నర్సీపట్నం వరకూ 20 కిలోమీటర్ల పొడవునా తారు రోడ్డు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే శెట్టిపాలెం, భీమబోయినపాలెం, తామరం, మాకవరపాలెం, కొండలఅగ్రహారం తదితర గ్రామాల్లో పనులు పూర్తి చేశామన్నారు. పెద్ద పెద్ద గోతులతో రోడ్డు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారని, ఈ పనులు పూర్తయితే సమస్య తప్పుతుందని ఆయన చెప్పారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

చీడికాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖండివరం తులసీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డు సహకారంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 180 మందికి నేత్ర తనిఖీలు చేయగా, 33 మందికి ఆపరేషన్లు అవసరమని గర్తించారు. అలాగే వంద మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 30 మందికి అవరసమైన మందులను ఉచితంగా అందించారు. అంతకుముందు ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, హిందుస్థాన్ షిప్‌యార్డు డీజీఎంలు కోటేశ్వరరావు, ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిచందన, శంకర్ ఫౌండేషన్ డీజీఎం వి.రమేష్‌కుమార్, టీడీపీ నాయకులు బండారు దయాకర్, ఎస్‌వీఎస్.నాయుడు, క్యాంపు కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మాడుగుల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రి పాలై అప్పులు చేసి చికిత్స పొందిన బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన నగదు ఎక్కులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అందించారు. మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో బుధవారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాడుగుల గ్రామానికి చెందిని షేక్ సులేమన్ కొన్ని నెలల క్రితం ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నారని, అతని కుటుంబం ఆర్థికంగా వెనుబడి ఉన్నప్పటికీ అప్పులు చేసిమరీ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని నాయకులు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బండారు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో వారి కుటుంబానికి ప్రభుత్వం రూ.3.37 లక్షలు సీఎం సహాయనిధి నుంచి మంజూరు చేసింది. ఈ చెక్కును ఎమ్మెల్యే బండారు చేతుల మీదుగా బాధితులకు అందించారు. అలాగే మండలంలో వంటర్లపాలెం గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి శ్రీనుకు రూ.98 వేలు చెక్కు అందించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరు దేముడు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, పార్టీ మాడుగుల అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి లెక్కల కాశిబాబు, నాయకులు సూర్యనారాయణరాజు, డిల్లీ నానాజీ, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

పల్లాకు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి

చీడికాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మినప పంటకు సోకిన పల్లాకు తెగులు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త ఎం.రాజ్‌కుమార్ సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని శిరిజాం కన్నూరువారి కళ్లాల వద్ద రైతులకు ప్రస్తుత పంటలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త రాజ్‌కుమార్ మాట్లాడుతూ వరి తీసిన తరువాత అపరాల సాగుచేయడం ఎంతో లాభదాయకమని చెప్పారు. దీనివల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మినపపంటలో ఆకులకు కన్నాలు ఎక్కువగా పడడం గమనించామని చెప్పారు. దీని నివారణకు ఎపిసేట్ లీటరు నీటిని ఒక గ్రామ చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పల్లాకు తెగులు వచ్చిన పంటను తీసివేసి దూరంగా పడవేయాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త సౌజన్య కూరగాయల పంటల సాగు పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారుల సూచనలు వింటున్న రైతులు

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

గొలుగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూముల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని బుధవారం మండలకేంద్రం గొలుగొండలో గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వివిధ భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వినతులను పరిశీలించి వీలైనవంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ ఫైన్లు, సర్పంచ్ చినప్పారావు, టీడీపీ నాయకులు ఎ.అప్పలనాయుడు, పి.నాగేశ్వరరావు, కె.చిట్టిబాబు, గండేపల్లి రాము, పుల్లేటికుర్తి రమేశ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఐదు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

దేవరాపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ శివారు బేతపూడి గ్రామంలో నాటుసారాతో ఉగ్గిన అచ్చిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ హనుమంతు బుధవారం తెలిపారు. గ్రామ శివారు ప్రాంతంలో ఐదు లీటర్ల నాటుసారా రవాణా చేస్తూ అచ్చిబాబు పట్టుబడ్డాడని చెప్పారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తిచేయండి

చీడికాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం పూర్తిచేయాలని ఎంపీడీవో హేమసుంద్రరావు సూచించారు. మండలంలోని తురువోలు గ్రామంలో బోదంకి దేముడుబాబుకు మంజూరైన గోకులం షెడ్డు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 75 గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేయగా, 27 షెడ్లు మంజూరయ్యాయన్నారు. వీటి నిర్మాణాలను వేగవంతం చేయించాలని ఏపీవో అల్లు గంగునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ కె.ఎర్రునాయుడుకు ఎంపీడీవో రైతులను ఆదేశించారు.



తురువోలు కళ్లాల్లో షెడ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొత్తకోట భూ సమస్య పరిష్కరించాలి

రెవెన్యూ శాఖా మంత్రి అనగానిని కోరిన జనసేన నేత రాజు

రావికమతం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట గ్రామానికి చెందిన వంద మంది రైతులు ఎదుర్కొంటున్న దాసరి పొలాల భూ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీవీఎస్ఎన్ రాజు కోరారు. ఈ మేరకు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. దొండపూడి రెవెన్యూ పరిధిలోని కల్యాణపులోవ రోడ్డును ఆనుకుని ఉన్న 75 ఎకరాల దాసరి వారి పొలాలు కొత్తకోటకు చెందిన వంద మంది రైతులు ఐదు దశాబ్దాలుగా సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని, వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల కోసం ఈ పొలాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా జనసేన పార్టీ హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లి నిలువరించిందని మంత్రికి వివరించారు. ఈ భూములకు శాశ్వత హక్కుగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు మంత్రి సత్యప్రసాద్ ఆదేశించారు.



దాసరి పొలాల సమస్యపై మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రాజు

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

చోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన గ్రామాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో పీఎస్‌జే ఆంజనేయులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఆరోగ్య సేవల కోసం సౌకర్యాలు, అంగన్‌వాడీల్లో సమస్యలు, గర్భిణీ స్త్రీలతో తలెత్తే లోపాలు, చిన్నపిల్లల పౌష్టికాహార లోప సమస్యలను గుర్తించడంతో పాటు వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతీ గ్రామంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించిందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ మహేశ్, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

'వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం'

దేవరాపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ నాయకులు కాటపల్లి అప్పారావు, కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషన్ బృందం పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు బుధవారం వినతిపత్రం అందించారు.

నేడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాక

నాతవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాలెం గ్రామంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ తెలిపారు. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమ్మేటివ్ గణిత పరీక్ష రేపు

నర్సీపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరు నుంచి పది తరగతుల సమ్మేటివ్ లెక్కల పరీక్షను శుక్రవారం నిర్వహిస్తున్నారు. సోమవారం జరగాల్సిన ఈ పరీక్ష పశ్నాపత్రాలు గుర్తు తెలియని వ్యక్తులు యూట్యూబ్‌లో పెట్టడంతో విద్యా శాఖ అధికారులు పరీక్ష రద్దు చేసిన విషయం తెలిసిందే. నర్సీపట్నం మండలానికి సంబంధించిన గణిత శాస్త్రం ప్రశ్నాపత్రాలు బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. వాటిని పోలీసులు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు పూడి వెంకట్రావు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన

చోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అవయవ దానంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని సామాజిక సేవా కార్యకర్త బాబ్జి తెలిపారు. అవయవ దానం వల్ల ఎంతో మందికి ప్రాణ దానం చేసే అవకాశం ఎలా లభిస్తుందో వివరిస్తామని ఆయన చెప్పారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

మాకవరపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ చెప్పారు. మండలంలోని వజ్రగడ గ్రామంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ అక్రమణలు, సరిహద్దులు, మ్యుటేషన్ సమస్యలను రైతులు ఈ సదసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.అనంతరం రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పలనాయుడు, మధు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

మహిళా వికాస స్ఫూర్తిదాత విశ్వం

చోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో మహిళా వికాసానికి స్ఫూర్తిగా వికాస విశ్వం నిలిచిపోతారని డాక్టర్ నీలం శారద కొనియాడారు. స్థానిక వికాస మ్యాక్స్ బ్యాంక్ వ్యవస్థాపకులు పరిమి విశ్వం వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వం చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రామాల్లో మహిళల పొదుపు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, వారిలో స్ఫూర్తిని నింపిన అంశాలను శారదతో పాటు సన్యాసిశెట్టి మరికొందరు ప్రముఖులు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు నిండిన మహిళలను చీర, నగదు బహుమతులతో పాటు మొక్కలను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఎండీ కోన సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలు వినియోగించుకోండి

రోలుగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నాగేశ్వరరావు కోరారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల లోపు పిల్లలకు నూతన ఆధార్ నమోదు, ఇతర పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్, మార్పులు, చేర్పులు తదితర సేవలు అందిస్తామన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో శరభవరం, రత్నంపేట సచివాలయాలు, 26, 27 తేదీల్లో బుచ్చెంపేట, కె.నాయుడుపాలెం, 28న జె.నాయుడుపాలెం, నిండుగొండ సచివాలయాల్లో ఈ శిబిరాలు జరుగుతాయని ఆయన చెప్పారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

రోలుగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్ష సూచన నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి విజయలక్ష్మి సూచించారు. వరి పంటను కోయవద్దని, ఇప్పటికే కోసినట్లయితే వరిని వదులుగా పెట్టుకుంటే గింజలు నల్లబడకుండా ఉంటాయని చెప్పారు. గింజలు మొలకెత్తకుండా ఉండడానికి ఉప్పు ద్రావణం చల్లాలని ఆమె సూచించారు. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కమిషన్‌కు ఎమ్మార్పీఎస్ వినతి

చోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా రిజర్వేషన్ పరంగా వివక్షతకు గురవుతున్న మాదిగలకు న్యాయం జరగాలంటే వర్గీకరణ అమలు చేయాల్సిందేనని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలకా మల్లిబాబు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాను బుధవారం విశాఖలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాదిగల స్థితిగతులు, వెనుకబాటుతనం గురించి ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు.

ఆలయానికి బీరువా వితరణ

చోడవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ ఆపదహర శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉపాధ్యాయ సంఘం నాయకుడు వేగి సూర్యప్రకాశరావు దంపతులు బీరువాను అందజేశారు. బుధవారం మధ్యాహ్నం ఆలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈవో సత్యనారాయణకు బీరువాను అందించారు.

రాజుబాబు సేవలు చిరస్మణీయం

కృష్ణాదేవిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ రాజుబాబు చేసిన పోరాటాలు, సేవలు చిరస్మణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కొనియాడారు. చోద్యం సెంటర్‌లో బుధవారం నిర్వహించిన రాజుబాబు వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అటవీ బంజర్ భూ పోరాటంలో చురుకైన పాత్ర పోషించి కులమతాలకు అతీతంగా ప్రజలంతా సమానంగా ఉండాలని పోరాడారని చెప్పారు. రాజుబాబు ఆశయ సాధనకు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మాకిరెడ్డి రామునాయుడు, మేకా భాస్కరరావు, మేకా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంధనం పొదుపుతో భవిష్యత్తుకు వెలుగు

దేవరాపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) ఇంధనాన్ని పొదుపు చేస్తే రేపటి తరానికి వెలుగులు అందించడం సాధ్యమవుతుందని ఈపీడీసీఎల్ ఏఈఈ కర్రి శంకరరావు అన్నారు. ఇంధన మండలంలోని బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ఇందన పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేశారు. అనంతరం ఏఈఈ మాట్లాడుతూ ఇళ్లల్లో విద్యుత్ ఆధారిత గృహోపకరణాలను ఏ విధంగా వినియోగిస్తే ఇంధనాన్ని పొదుపు చేయవచ్చనే అంశాలను వివరించారు.

సంతరించుకున్న ప్రత్యేకత

పాడేరులో వేకువజాము సంత

- శీతాకాలంలో ప్రతి రోజూ క్రయవిక్రయాలు
- ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న వైనం
- తాజా పువ్వులు, కూరగాయలు, ఆకుకూరలు, అటవీ ఉత్పత్తుల అమ్మకాలు
- గిరిజన రైతులు, వర్తకులతో సందడి


పాడేరు తెల్లవారు సంతకు వివిధ ఉత్పత్తులతో వచ్చిన గిరి రైతులతో హడావుడి

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీలో సంత అంటే వారానికి ఒక రోజు జరగడం సహజం. కానీ అందుకు భిన్నంగా జిల్లా కేంద్రం పాడేరులో ప్రతి రోజూ తెల్లవారు జామున అంబేడ్కర్ సెంటర్, పాతబస్టాండ్ ఆవరణలో ఈ సీజన్‌లో ప్రత్యేకంగా సంత(తెల్లవారు సంత) జరుగుతుంటుంది. ప్రతి ఏడాది శీతాకాలంలో కేవలం పాడేరులో మాత్రమే ఈ తరహా ప్రత్యేకమైన తెల్లవారుజాము సంత ఎన్నో ఏళ్లుగా సాగుతోంది. పాడేరుకు చేరువగా ఉన్న పెదబయలు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజన రైతులు ఈ సంతకు వచ్చి తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను వర్తకులకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఉదయాన్ని ఒక వైపు మంచు కురుస్తుండగా, మరో వైపు హడావిడిగా జరిగే వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలతో ఈ సంతలో దృశ్యాలు ఏజెన్సీకి వచ్చిన వారికి పదే పదే చూడాలనిపించే ఆసక్తిని కలిగిస్తాయి.

సంతలో లభించే అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు

పాడేరులో తెల్లవారుజామున జరిగే సంతలో పలు రకాల పువ్వులు, చిలగడ, కంద, నాగలి జాతికి చెందిన దుంపలు, గుమ్మడి కాయలు, తోటకూర, లేత గుమ్మడి ఆకులు, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి వంకాయలు, దొండ కాయలు, టమోటా వంటి పలు రకాల కూరగాయలు సరసమైన ధరలకు లభిస్తాయి. దీంతో మైదాన ప్రాంతాలకు చెందిన వర్తకులు తెల్లవారుజామునే పాడేరు చేరుకుని ఉదయం వాటిని గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేసి వాహనాల్లో మైదాన ప్రాంతాల్లోని మార్కెట్‌లకు తరలిస్తారు. దసరా పండుగ తరువాత నుంచి దాదాపుగా సంక్రాంతి పండుగ వరకు ఈ సంత జరుగుతుంది. మైదాన ప్రాంతానికి చెందిన జనం, ఈ సీజనల్‌లో మన్యానికి వచ్చే పర్యాటకులు ఈ సంతను తిలకిస్తూ వింత అనుభూతిని పొందుతారు.


సంతకు తెచ్చిన క్యాలీఫ్లవర్, ముల్లంగి


సంతలో రైతులు తీసుకువచ్చిన చిలగడ దుంపలు

సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



పాడేరు అంబేడ్కర్ సెంటర్, పాతబస్టాండ్ ప్రాంతంలో ఉదయ వేళల్లో జరిగే సంతలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు వంటివి కల్పించాలి. వివిధ గ్రామాల నుంచి వచ్చే గిరిజన రైతులకు, మైదాన ప్రాంతాల నుంచి వచ్చే వర్తకులకు కనీసం తాగేందుకు నీరు, అవసరానికి మరుగుదొడ్ల సదుపాయం లేదు. దీంతో రైతులు, వర్తకులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షల్లో వ్యాపారం జరిగే ఈ ప్రదేశంలో కనీసం తాగునీటి సదుపాయం సైతం లేకపోవడం బాధాకరం. రైతులు, వర్తకుల నుంచి పంచాయతీ యాజమాన్యం, మార్కెటింగ్ శాఖ సెస్సు వసూలు చేస్తున్నప్పటికీ సదుపాయాలు కల్పించడం లేదు - **కొర్రా భీమలమ్మ**, రైతు, కోడెలి గ్రామం, హుకుంపేట మండలం

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



ఉదయం వేళల్లో జరిగే సంతలో అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు అనువుగానే ఉంది. కానీ ఆయా పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ సంతకు తీసుకువచ్చిన సరకులన్నీ పచ్చివి (తాజా)కావడంతో వాటిని ఎంతో కొంత రేటుకు సంతలో అమ్ముకోవడం మినహా తిరిగి వాటిని ఇంటికి తీసుకువెళ్లలేని దుస్థితి. ఈ నేపథ్యంలో ధరలు ఎలా ఉన్నా వాటిని వర్తకులకు అమ్ముకోవడం తప్పా, మరో దారి లేదు. ఈ క్రమంలో దూర ప్రాంతాల నుంచి సంతకు సరకులను తీసుకువచ్చే గిరిజన రైతులు అనేక సందర్భాల్లో నష్టపోతున్నారు. అందువల్ల మా కష్టానికి తగ్గట్టుగా గిట్టుబాటు ధరలు లభించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం. - **జన్ని కోటిబాబు**, గూడ, హుకుంపేట

కలగానే కాజ్‌వే నిర్మాణం!

... 5వ పేజీ తరువాయి

మళ్లీ కొట్టుకుపోయింది. సిమెంట్ పైపులు మాత్రమే మిగిలాయి. కాజ్‌వే నిర్మించి అప్పటికి ఏడాదిన్నర పూర్తయినా ప్రభుత్వం బిల్లు ఇవ్వకపోవడంతో కాజ్‌వేకు వేసిన సిమెంట్ పైపులను కాంట్రాక్టర్ తీసుకెళ్లిపోయారు. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం కొత్త కాజ్‌వే నిర్మాణం గురించి పట్టించుకోలేదు. పంచాయతీరాజ్ అధికారులు రూ.80 లక్షల అంచనా వ్యయంతో ఏటా ప్రతిపాదనలు తయారు చేసి పంపడం, టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం ఆనవాయితీగా మారింది. నాలుగేళ్ల కాలంలో పాత కాజ్‌వేకు కనీసం మరమ్మతు పనులు కూడా చేయించలేదు. నాటి వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు మాత్రం త్వరలో కాజ్‌వే నిర్మాణం జరుగుతుందని చెబుతూ స్థానిక గ్రామాల ప్రజలను మభ్యపెడుతూ వచ్చారు. కాజ్‌వే నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు చోడవరం రావడానికి నరసాపురం, వెంకన్నపాలెం మీదుగా చుట్టూ తిరగవలసి వస్తున్నది. కూటమి ప్రభుత్వం.. ఎర్రిగెడ్డపై కాజ్‌వే నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానిక గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విశాఖ డెయిరీలో ఉద్రిక్తత

- చైర్మన్ కార్యాలయం ముట్టడికి కార్మికుల యత్నం
- విధులు బహిష్కరణ.. దిగివచ్చిన యాజమాన్యం
- కార్మిక సంఘ నేతలతో చర్చలు
- పదవీ విరమణ వయసు పెంపు సహా పలు డిమాండ్లు నెరవేర్చేందుకు అంగీకారం
- ఆందోళన విరమిస్తున్నట్టు కార్మికుల ప్రకటన

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాల చెల్లింపు, ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పీఆర్‌సీ అమలు తదితర డిమాండ్ల సాధన కోసం గత 28 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విశాఖ డెయిరీ కార్మికులు బుధవారం చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కార్యాలయాన్ని ముట్టడించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో సాయంత్రం యాజమాన్యంతో జరిపిన చర్చలు ఫలప్రదం కావడంతో ఆందోళన కార్యక్రమాలను విరమిస్తున్నట్టు కార్మిక నాయకులు ప్రకటించారు. వివరాలిలా ఉన్నాయి.

యాజమాన్యంతో చర్చల కోసం ఉదయం కార్మిక నాయకులు నగరంలోని జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. అయితే డిమాండ్లపై నోరుమెదపని యాజమాన్య ప్రతినిధులు తమకు మూడు నెలలు సమయం కావాలని చెప్పి వెళ్లిపోవడంతో కార్మిక నాయకులు నిరాశతో వెనుతిరిగారు. డెయిరీ వద్దకు చేరుకుని దీక్షలో ఉన్న కార్మికులకు జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన విషయం చెప్పారు. దాంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇక నిరాహార దీక్షలతో యాజమాన్యం దిగిరాదంటూ నినాదాలు చేసుకుంటూ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కార్యాలయం వద్దకు చేరుకుని బైఠాయించారు. సౌత్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేసినప్పటికీ కార్మికులు వెనక్కి తగ్గకుండా గట్టిగా నినాదాలు చేయడంతో చివరకు డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్ బయటకు వచ్చి కార్మికుల డిమాండ్లు తెలుసుకున్నారు. డెయిరీ పాలకవర్గంతో చర్చించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస వేతనాలు అమలు చేస్తామని, కార్మికుల పర్మినెంట్ అంశం మాత్రం వారి సీనియారిటీ వంటి వాటిని పరిశీలించి పరిష్కరిస్తానని ఆనంద్‌కుమార్ చెప్పారు. మెటర్నిటీ లీవ్ ఇస్తామని తెలిపారు. ఆందోళన చేస్తున్న యూనియన్‌తో పాటు డెయిరీలో ప్రస్తుతం ఉన్న మరో యూనియన్‌తో కలిసి సమస్యలపై చర్చిద్దామన్నారు. దీనికి ఎంప్లాయిస్ యూనియన్ అంగీకరించలేదు. ప్రస్తుతం డెయిరీలో ఉన్న యూనియన్...యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తున్నదని వారితో కలసి తాము చర్చించబోమని నాయకులు స్పష్టంచేయడంతో ఆనంద్ కుమార్ వెళ్లిపోయారు. దీంతో ఆందోళన చేస్తున్న కార్మికులు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. ఈ విషయం తెలిసి డెయిరీలో గల కార్మికులంతా విధులను బహిష్కరించారు. దీంతో యాజమాన్యం దిగివచ్చింది.


డెయిరీ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

మరోమారు చర్చలకు సిద్ధమైంది. ఈ చర్చలలో పలు డిమాండ్లను నెరవేర్చేందుకు యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. యాజమాన్యంతో కుదిరిన ఒప్పందాలను కార్మిక నాయకులు వివరించారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 60కి పెంచడంతో పాటు పీఆర్‌సీలో భాగంగా 7 శాతం ఐఆర్ ఈ నెల నుంచి అమలు చేసేందుకు, తరువాత వేతన సవరణలో మరింత పెంపునకు యాజమాన్యం అంగీకరించినట్టు తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు సీనియారిటీ ప్రాతిపదికన 16 వేల నుంచి 19 వేల రూపాయలు వేతనం చెల్లించడంతో పాటు సెలవుల మంజూరుకు, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించేందుకు అంగీకరించినట్టు తెలిపారు. ఇక ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక కార్మికులను సీనియారిటీ ప్రాతిపదికన ఏడాదికి 25 శాతం చొప్పున వచ్చే జనవరి 1 నుంచి పర్మినెంట్ చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందని ప్రకటించారు. ఈ చర్చలలో డెయిరీ ఎండీ ఎస్‌వి రమణ, జీఎం విజయారావు, కార్మిక నాయకులు ఎ.రమణ, ఎం.రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయం పక్కదారి

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసింది. నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఇక్కడి నుంచి ఎవరైనా ఉచితంగా తాగునీటిని తీసుకెళ్లవచ్చు. అయితే నిర్వహణ సరిగా లేకపోతే ప్లాంట్ పాడైపోతుందన్న ఉద్దేశంతో పంచాయతీ పాలకవర్గం ప్రతినిధులు.. ఆర్వో ప్లాంట్ వద్ద శ్రీనివాసరావు అనే వ్యక్తిని నియమించారు. 20 లీటర్ల నీటికి రూ.5 చొప్పున వసూలు, వచ్చిన డబ్బులను అతనికే జీతంగా ఇచ్చేవారు. క్రమేపీ నీటి అమ్మకాలు పెరిగాయి. పంచాయతీ అధికారులు, ఆర్వో ప్లాంట్ నిర్వహణకు నియమించిన వ్యక్తి కుమ్మక్కయ్యారు.

ఈ ఏడాది మే నెల నుంచి 20 లీటర్ల నీటిని రూ.10కి విక్రయించడం మొదలుపెట్టారు. బయట బోర్డు మీద మాత్రం '20 లీటర్ల వాటర్ క్యాన్ రూ.5' అని వుంటుంది. నీటి అమ్మకం ధరను ఒక్కసారిగా రెట్టింపు ఎందుకు చేశారని ఎవరైనా అడిగితే.. ప్లాంట్ వద్ద నియమించిన వ్యక్తికి జీతంతోపాటు ఆర్వో ప్లాంట్ నిర్వహణ ఖర్చుల కోసమని అధికారులు బదులిస్తున్నారు. మరోవైపు లీటరు, అర లీటరు వాటర్ బాటిళ్లను కూడా విక్రయిస్తున్నారు. ప్లాంట్ నిర్వహణకు నియమితులైన వ్యక్తి.. సొంతంగా లీటరు, అర లీటరు ప్లాస్టిక్ బాటిళ్లను సమకూర్చుకుని, వాటికి 'మినరల్ వాటర్' అని స్టిక్కర్లు అతికించి, లీటరు రూ.10, అర లీటరు రూ.5కి అమ్ముతున్నాడు. వివిధ పనులపై మండల కాంప్లెక్స్‌కు వచ్చే ఇక్కడ వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసి తాగుతున్నారు. ఈ ప్లాంట్‌లో రోజుకి ఎంత నీరు అమ్ముతున్నారు? ఎంత ఆదాయం వస్తున్నది? అన్న లెక్కలు మాత్రం లేవు.

దీనిపై అచ్యుతాపురం పంచాయతీ సర్పంచ్ కూండ్రపు విమలకుమారిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. వాటర్ ప్లాంట్ వద్ద నిరంతరాయంగా ఒక వ్యక్తి వుండాలని, పంచాయతీ ఉద్యోగిని అక్కడ ఉంచలేము కనుక ప్రైవేటుగా ఒక వ్యక్తిని నియమించామని చెప్పారు. 20 లీటర్ల క్యాన్ నీటికి రూ.5 మాత్రమే వసూలు చేయాలని పంచాయతీ తరపున బోర్డు కూడా పెట్టామని తెలిపారు. 20 లీటర్ల నీటికి రూ.10 వసూలు చేస్తున్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ చెప్పారు.

వరి రైతులు అప్రమత్తం

- మూడు రోజులపాటు వరి కోతలు వాయిదా వేసుకోండి
- జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్రఅల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో వరి పంట సాగు చేపట్టిన రైతులు అప్రమత్తంగా ఉండాలని జేసీ ఎం.జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. రెండు, మూడు రోజుల వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోసిన పంటను ఎత్తయిన ప్రదేశంలో కుప్పలు వేసుకుని, వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాలని చెప్పారు. వరి పంటను నూర్చి, కల్లాల్లోనే వున్న ధాన్యం తడిసిపోకుండా వుండడానికి రైతులకు 600 టార్పాలిన్లు పంపిణీ చేశామని తెలిపారు. ఇంకా అవసరమైతే టార్పాలిన్‌లు కొనుగోలు చేసి అందిస్తామన్నారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు ఫోన్ (నంబర్లు 8008901584, 9492821030) చేసి చెప్పాలన్నారు.

వరి పంట కోత, నూర్పులనుబట్టి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, దేవరాపల్లి, మాడుగుల, చోడవరం, రావికమతం మండలాల్లో ధాన్యం కొనుగోలు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని జేసీ చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 406.16 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 124 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.87 లక్షలు జమ చేశామని ఆమె తెలిపారు.

ముసురు..!

... 5వ పేజీ తరువాయి

చేసుకోవాలన్నారు. కాగా చోడవరంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తరువాత నుంచి దఫదఫాలుగా జల్లులు పడుతున్నాయి. చీడికాడ మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. రాత్రి ఎనిమిది గంటల తరువాత వర్షం తీవ్రత పెరిగింది. సముద్ర తీరంలో వున్న పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో వర్షం జోరు పెరిగింది.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


నీలబాబు మృతదేహం

రాంబిల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పరవాడకు చెందిన బండారు నీలబాబు(39) దొరాజియా కంపెనీలో పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం రాంబిల్లి మండలంలోని నేవీ కాలనీ దరి నేవీ ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్ద డ్రైనేజీ పనులకు కొలతలు తీస్తున్నాడు. ఇంతలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. తోటి ఉద్యోగులు వెంటనే అతనిని రాంబిల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని సాయంత్రం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. నీలబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


సోమరాజు(ఫైల్)

ఎలమంచిలి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎలమంచిలి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పోతిరెడ్డి గ్రామంలో ఈ నెల 16వ తేదీన ఆ గ్రామానికి చెందిన పిల్లి సోమరాజు(34) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని కేజీహెచ్‌కి తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి


వెంకటసాయి (ఫైల్)

చింతపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బూదరాళ్ల ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు కేజీహెచ్‌లో మృతిచెందాడు. రాజవొమ్మంగి మండలం శరభవరం గ్రామానికి చెందిన అన్నదమ్ములు కాకరి అఖిల్ వెంకటసాయి, సాయి చంద్ మంగళవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై కొయ్యూరు-పెదవలస మార్గంలో ప్రయాణిస్తూ బొంతువలస గ్రామానికి సమీపంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన అఖిల్ వెంకటసాయిని కేజీహెచ్‌కి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.

తూటిపాలలో వివాహిత ఆత్మహత్య


కొల్లు విజయ (ఫైల్)

మాకవరపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటిపాల గ్రామంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి. తూటిపాల గ్రామానికి చెందిన కొల్లు సూర్యనారాయణమూర్తి, విజయ (24) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు వున్నారు. సూర్యనారాయణమూర్తి జమ్మూకశ్మీర్‌లో సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ)లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగరీత్యా జమ్మూకశ్మీర్‌లోనే వుంటూ, ఏడాదికి రెండు, మూడుసార్లు తూటిపాల వచ్చి వెళుతుంటారు. ప్రస్తుతం అక్కడే విధి నిర్వహణలో వున్నారు. ఇద్దరు కుమార్తెలతో విజయ తూటిపాలలో నివాసం వుంటున్నది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఇంటి తలుపులు మూసే వుండడంతో ఇరుగుపొరుగు వారికి అనుమానం వచ్చి రావికమతం మండలం తోటకూరపాలెంలో వుంటున్న ఆమె పుట్టింటి వారికి ఫోన్ చేసి చెప్పారు. వీరు తూటిపాల గ్రామానికి సమీపంలోని కొండలఅగ్రహారంలో ఉన్న తమ బంధువుకు సమాచారం అందించారు. ఆయన 100 నంబర్‌కు ఫోన్ చేయడంతో కొద్దిసేపట్లో పోలీసులు తూటిపాల చేరుకున్నారు. తలుపులు తెరిచి చూడగా విజయ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. పంచనామా అనంతరం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి శరీరంపై కొన్నిచోట్ల గాట్లు వున్నాయని, విజయ ఆత్మహత్య చేసుకుందా? లేకపోతే ఎవరైనా హత్య చేశారా? అన్నది పోస్టుమార్టం నివేదిక ద్వారా తెలుస్తుందని, దీంతోపాటు కుటుంబంలో కలహాలు ఏమైనా వున్నాయా అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

14 కిలోల గంజాయి స్వాధీనం: ముగ్గురి అరెస్టు

నక్కపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద బుధవారం 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు సీఐ కుమారస్వామి తెలిపారు. వారు జి.మాడుగుల మండలం నుంచి తమిళనాడు రాష్ట్రానికి 14 కిలోల గంజాయి ప్యాకెట్లను బస్సులో తీసుకు వెళుతుండగా పక్కా సమాచారంతో వేంపాడు టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నామని చెప్పారు. తమిళనాడు రాష్ట్రం తిరుపూర్ జిల్లాకు చెందిన పరమశివమ్, మధురై జిల్లాకు చెందిన మురుగన్‌తో పాటు మరో జువెనైల్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజు లేఖర్లకు నో ఎంట్రీ

- జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

నర్సీపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోకి దస్తావేజు లేఖర్లను రానివ్వబోమని జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు చెప్పారు. 'కాసులిస్తేనే రిజిస్ట్రేషన్' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన కథనానికి జిల్లా రిజిస్ట్రార్ స్పందించారు. బుధవారం నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారు. సిబ్బందిని, అక్కడున్న కక్షిదారులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్తుల కొనుగోలుదారులను విచారింగా.. దస్తావేజు లేఖర్లు అదనంగా డబ్బులు తీసుకోవడం లేదని, డాక్యుమెంట్ తయారు చేసినందుకు మాత్రమే డబ్బులు తీసుకుంటున్నారని చెప్పారని అన్నారు. ఇకనుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోకి ఆస్తుల క్రయవిక్రయదారులు, సాక్షి సంతకం పెట్టేవారిని మాత్రమే అనుమతిస్తామని, దస్తావేజు లేఖర్లను లోపలికి అనుమతించేది లేదన్నారు. రిజిస్ట్రేషన్ చేయడానికి ఎవరైనా డబ్బులు అడిగితే 70939 21385 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు.

భరణికంలో అతిసార

... 5వ పేజీ తరువాయి


గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

బుధవారం గ్రామంలో పర్యటించారు. అతిసార ప్రబలడానికిగల కారణాలపై ఆరా తీశారు. అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి కేవీవీ శ్రీనివాసరావు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకుల్లో క్లోరిన్ వేయించారు. పీహెచ్‌సీ వైద్యులు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. డయేరియా లక్షణాలున్న వారందరికీ పరీక్షలు జరిపి మందులు అందించారు. విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604